## తోడేళ్లను వదిలి.. కుందేళ్లపై వేటు!

- అటవీశాఖలో 'ప్రక్షాళన'పై విమర్శల వెల్లువ
- 9 మంది ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు
- అవినీతిలో తప్పించుకుంటున్న పైస్థాయి అధికారులు
- అటవి భూముల రక్షణ విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదు : సిద్ధార్థ విక్రమ్‌సింగ్

6







మధిరలో జమ్మి చెట్టుకు పూజలు చేస్తున్న భట్టి దంపతులు



ఇల్లెందులో ప్రసంగిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

# దసరా వైభవం..

- ఉమ్మడి జిల్లాలో ఘనంగా విజయదశమి వేడుకలు
- ఖమ్మంలో జమ్మిబండ వద్ద పారువేట
- స్తంభాద్రి లక్ష్మీనర్సింహస్వామికి ప్రత్యేక పూజలు
- హాజరైన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- మధిరలో డిప్యూటీ సీఎం భట్టి దంపతుల పూజలు
- ఇల్లెందు జేకే కాలనీలో రావణ దహన కార్యక్రమం
- పాల్గొన్న మంత్రి పొంగులేటి

దసరా వేడుకలు ఉమ్మడిజిల్లాలో గురువారం వైభవంగా జరిగాయి. ఓ వైపు ఆలయాలు.. మరోవైపు పారువేట, రావణ దహన వేదికలు వేలాది మందితో సందడిగా మారాయి. అర్చకులు శమీ, ఇతర ప్రత్యేక పూజలు చేయగా.. భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. జమ్మిచెట్టుకు ముడుపులు కట్టారు. ఖమ్మం జమ్మిబండ వద్ద జరిగిన పారువేట ఉత్సవానికి వేలాది మంది భక్తులు తరలిరాగా.. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వామివారిని దర్శించుకున్నారు. మరోవైపు భద్రాద్రి జిల్లాలోనూ విజయదశమి సంబురాలు అంబరాన్నంటాయి. ముఖ్యంగా ఇల్లెందు జేకే కాలనీ సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన దసరా వేడుకలు అట్టహాసంగా సాగాయి. ఈ వేడుకలకు రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. మధిరలో జరిగిన వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి దంపతులు హాజరై పూజలు నిర్వహించారు.

7



ఖమ్మం జమ్మిబండ వద్ద మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

## దక్షిణ అయోధ్యలో.. విజయోత్సవం

- భద్రాద్రి రామయ్యకు మహాపట్టాభిషేకం
- ఆకట్టుకున్న శ్రీ రామ్‌లీలా మహోత్సవం
- బాణం సంధించిన దేవస్థానం ఈవో దామోదర్‌రావు

వివరాలు : 7లో



# తీర్పుపై ఉత్కంఠ

- హైకోర్టు జడ్జిమెంట్ కోసం పార్టీల ఎదురుచూపు
- 8న ఎలాంటి నిర్ణయం వస్తుందోనని ఆందోళన
- ఇప్పటికే స్థానిక పోరుకు సిద్ధమవుతున్న పార్టీలు

ఖమ్మం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఓ వైపు స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. దీంతో అన్ని పార్టీలు పోరుకు సిద్ధమవుతున్నాయి. మండల, గ్రామస్థాయి నాయకులతో ముఖ్య నేతలు మంతనాలు సాగిస్తున్నారు. మరోవైపు యంత్రాంగం కూడా ఎన్నికల ఏర్పాట్లలో బిజీగా ఉంది. ఇంతవరకూ బాగానే ఉన్నా బీసీ రిజర్వేషన్లపై 8వతేదీన హైకోర్టు ఇవ్వబోయే తీర్పు అందరిలోనూ ఉత్కంఠ రేపుతోంది. తీర్పు ఎలా ఉండబోతుందో అన్న సందేహాల మధ్య రాజకీయపార్టీలు కదనరంగంలోకి దూకుడుగా ముందుకెళ్లలేకపోతున్నాయి. అయితే 9న ఎన్నికల నోటిఫికేషన్ వెల్లడిచంచనున్నట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటించింది. కానీ 8న వచ్చే హైకోర్టు తీర్పు ప్రకారమే ఎన్నికల కమిషన్ తీసుకునే నిర్ణయం కూడా ఆధారపడి ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో రాజకీయ పార్టీలు హైకోర్టు నిర్ణయాన్ని అనుసరించి జిల్లాలో ముందుకు పోయే పరిస్థితి కనిపిస్తోంది.

**శ్రేణులతో అంతర్గత సమావేశాలు..**

స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్న రాజకీయ పార్టీలు.. కార్యకర్తలు, నాయకులతో అంతర్గతంగా సమావేశమవుతున్నాయి. రిజర్వేషన్ల ప్రకారం ఆశావహుల జాబితాలు సిద్ధం చేయాలని అధికార కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్, బీజేపీ, వామపక్ష పార్టీల అధినాయకత్వాలు ఇప్పటికే తమ జిల్లా స్థాయి నేతలకు సూచించాయి. దీంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో నేతలు అంతర్గత సమావేశాలు నిర్వహించారు. ఈ క్రమంలో షెడ్యూల్ ప్రకారంగా ఎన్నికలు జరుగుతాయా, హైకోర్టు తీర్పు ఉంటుందనే అంశాలపై ఆయా సమావేశాల్లో సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. దీంతో రాజకీపార్టీల నేతలు కూడా మీమాంసలో పడ్డారు. దీంతో అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల వ్యూహరచనల్లో ముందుకు పోలేకపోతున్నారు. హైకోర్టు తీర్పు, ఆ తర్వాత ఎన్నికల సంఘం తీసుకునే నిర్ణయంపై ఓ స్పష్టత వచ్చిన తర్వాతే ఉమ్మడిజిల్లాలో స్థానిక ఎన్నికల సందడి ముమ్మరంకానుంది.

**డీలాపడిన 'జనరల్' నేతలు**

ఈసారి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఎక్కువశాతం రిజర్వేషన్ ఉండడం, జనరల్ స్థానాలు తగ్గడంతో ఓసీ నుంచి అభ్యర్థిత్వాలు (మిగతా 6వ పేజీలో)

## బెట్టింగ్ వద్దని మందలించినందుకు..

- అమ్మమ్మను హత్యచేసిన మనవడు
- మంచం కోడు, ఇంటి గచ్చుకు మోది హతమార్చిన వైనం
- టీవీ సౌండ్ పెంచి మరీ ఘాతుకం
- ఎర్రుపాలెం మండలం సఖినవీడులో ఘటన
- పోలీసుల అదుపులో నిందితుడు



పద్మ (ఫైల్)

7



వెంకటరమణ (ఫైల్) రమేష్ మృతదేహం శ్రీనివాసరావు (ఫైల్)

## బతుకమ్మ నిమజ్జన వేడుకల్లో అపశ్రుతులు

- రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి, పలువురికి గాయాలు
- భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలంలో ఘటన
- డ్యాన్స్ చేస్తూ డీజే శబ్దానికి ఆగిన యువకుడి గుండె
- బూర్గంపాడు మండలం లక్ష్మీపురంలో విషాదం
- కల్లూరు మండలం కప్పలబంధంలో శిలాఫలకాన్ని ఢీకొట్టిన ట్రాక్టర్
- గాయపడి చికిత్స పొందుతూ ప్రభుత్వ ఉపాధ్యాయుడి కన్నుమూత

7

## 7న శబరి స్మృతి యాత్ర

భద్రాచలం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో 7న శబరి స్మృతి యాత్ర నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు తెలిపారు. 7న ఉదయం 6.30కి శబరి మాత చిత్రపటంతో భద్రగిరి ప్రదక్షిణ నిర్వహించనుండగా.. దమ్మక్క విగ్రహానికి పూజలు నిర్వహించి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. దేవస్థానం ప్రచార రథంతో శోభాయాత్ర, స్వామి వారి ప్రచారమూర్తుల కల్యాణం నిర్వహణ, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. గిరిజన భక్తులకు హిందూ సంప్రదాయం, స్వామి వారి సంప్రదాయాలు తెలిసేందుకు ఆర్టీసీ సహకారంతో బస్సులను ఏర్పాటు చేసి గిరిజనులను తీసుకొచ్చి వారికి దేవస్థానం తరపున తగిన సౌకర్యాలు కల్పించనున్నారు. ఈ సందర్భంగా వారి చేతుల మీదుగా ఫల పుష్పాదులతో అర్చనలు, కల్యాణోత్సవం నిర్వహించనున్నట్టు ఈవో తెలిపారు. ఈ సమయంలో వారికి అల్పాహారం, అన్నప్రసాదం, లడ్డూ ప్రసాదం, వసతి దేవస్థానం ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమం ముగిసిన తరువాత వారిని స్వగ్రామాలకు చేరుస్తామన్నారు. ఈ ఏడాది సెప్టెంబరులో శ్రీసీతారామచంద్రస్వామి వారిని 1,41,846 మంది భక్తులు దర్శించుకున్నారని, గతేడాది సెప్టెంబర్లో 1,03,352 మంది దర్శించుకున్నట్టు తెలిపారు.



## కొత్తగూడెంలో కేంద్రీయ విద్యాలయం

కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కేంద్రీయ విద్యాలయం మంజూరైంది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి మొత్తం నాలుగు కేంద్రీయ విద్యాలయాలను మంజూరు చేయగా.. వాటిలో ఒకటి కొత్తగూడెంలో ఏర్పాటు కానుంది. కొత్తగూడెంలోని లక్ష్మీదేవిపల్లి పాలకేంద్రంలో ఐదెకరాల స్థలాన్ని ఈ విద్యాలయానికి కేటాయించినట్టు తెలుస్తోంది. 2026-2027 విద్యా సంవత్సరం నుంచి ఈ కేంద్రీయ విద్యాలయం అందుబాటులోకి వస్తుందని, తాత్కాలికంగా పాత కొత్తగూడెంలోని ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో నిర్మించిన భవనాల్లో తరగతులు, వసతిగృహం ఏర్పాటు చేయనున్నారు.

## సాధారణ స్థితికి గోదావరి



భద్రాచలం వద్ద గోదావరిలో స్నానాలు చేస్తున్న భక్తులు

భద్రాచలం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం వద్ద గోదావరి సాధారణ స్థితికి చేరుకుంటోంది. బుధవారం 48.5 అడుగులకు చేరుకున్న గోదావరి నీటిమట్టం అనంతరం క్రమేపి తగ్గుముఖం పట్టింది. గురువారం ఉదయం 6గంటలకు 42.4 అడుగులకు తగ్గడంతో మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరించారు. సాయంత్రం 6 గంటలకు 40.3 అడుగులకు తగ్గగా, రాత్రి 10 గంటలకు 39.3 అడుగులు, గురువారం ఉదయం 7గంటలకు 37.5 అడుగులు, 9 గంటలకు 37.1 అడుగులకు తగ్గింది. మధ్యాహ్నం 12 గంటలకు 36.9 అడుగులకు తగ్గగా అనంతరం రెండు గంటల పాటు నిలకడగా ఉంది. ఈ క్రమంలో సాయంత్రం 6 గంటలకు 36.7 అడుగులకు గోదావరి నీటిమట్టం తగ్గింది. కాగా రాబోయే 24 గంటల్లో ఈ నీటిమట్టం మరింత తగ్గే అవకాశం ఉందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## కోటమైసమ్మ జాతర ప్రారంభం

- భారీగా తరలివస్తున్న జనం
- సందడిగా మారిన ఉసిరికాయలపల్లి
- అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కనకయ్య, ఎమ్మెల్సీ తాతా మధు

6



తొలిరోజు జాతరకు భారీగా తరలివచ్చిన జనం

# జాతి గౌరవాన్ని నిలబెట్టాలి

● రూ.40 లక్షల విరాళంతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ● శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంఖానాపురం హవేలి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : సమాజం అభివృద్ధి చెందాలంటే అందరూ కలసికట్టుగా ముందుకు రావాలని రాష్ట్ర వ్యవసాయం, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం స్వర్ణభారతి కమ్మవారి కళ్యాణ మండపంలో జరిగిన కమ్మ మహాజన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సభకు ముందు మంత్రి స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. ఎంతోమంది పెద్దల సహకారంతో కమ్మ మహాజన సంఘం ఏర్పడిందని, అది సమాజానికి మార్గదర్శిగా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు. పరుచూరి వెంకటేశ్వరరావు, స్వతంత్ర్య లక్ష్మి దంపతులు స్కిల్ సెంటర్ నిర్మాణానికి అందించిన రూ.40లక్షల విరాళం అభినందనీయమని, ఆ నిధులను పారదర్శకంగా వినియోగించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఉపయోగపడేలా చూడాలని ఆయన సూచించారు. ఇలాంటి దాతల సహకారం వల్ల సమాజం ముందుకు సాగుతుందని, వారి త్యాగం భవిష్యత్ తరాలకు ఆదర్శమని ఆయన అభినందించారు. పూర్వీకులు సృష్టించినటువంటి చరిత్రకు మచ్చవచ్చే విధంగా మనం బతకవద్దని, కులం


స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ భూమి పూజలో పాల్గొన్న మంత్రి తుమ్మల

వల్ల కొన్ని అవకాశాలు వస్తాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుంటూ కులం అభివృద్ధికి అందరం కలిసికట్టుగా పని చేయాలన్నారు. కులం చరిత్ర, తాత్పత్వం, ధీరత్వం, వీరత్వం మనం అందులో పుట్టినందుకు గర్వించాలన్నారు. అనంతరం ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్ 1 ఫలితాలలో విజయం సాధించిన అభ్యర్థులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా సన్మానించారు. కఠినమైన పోటీ పరీక్షలో రాణించి రాష్ట్రానికి గౌరవం తీసుకువచ్చిన అభ్యర్థుల కృషిని ప్రశంసించారు. అలాగే దాతలను ఘనంగా సన్మానించి, సమాజం కోసం చేస్తున్న సేవలను గుర్తించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావులు హాజరై మాట్లాడారు. సమాజ అభివృద్ధి, ఐక్యత, యువతకు ఉపాధి అవకాశాల కల్పన అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. దాత పరుచూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నేను సంపాధించిన దాంట్లో కొంతను ఇలాంటి కార్యక్రమాలకు వినియోగించడం నా ధర్మంగా భావిస్తున్నాను. సమాజానికి తిరిగి ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యతని తెలిపారు. మంత్రి, ప్రజాప్రతినిధులు, పెద్దలు అందరూ సమాజ అభివృద్ధి కోసం కలసికట్టుగా పనిచేసి, కమ్మ మహాజన సంఘం స్థాపించిన లక్ష్యాలను నెరవేర్చాలని పిలుపునిచ్చారు. సభకు కమ్మ మహాజన సంఘం అధ్యక్షుడు కొల్లు రఘు సత్యనారాయణ, కార్యదర్శి చావా రాము, సంఘం ఉపాధ్యక్షుడు కర్నాటి రమాదేవి, సహాయ కార్యదర్శి వజ్జా శ్రీనివాసరావు, కోశాధికారి తుళ్లూరి నిర్మలా కుమారి, కార్యవర్గ సభ్యులు మోతుకూరి సత్యనారాయణ, మేదరమెట్ల స్వరూపరాణి, నల్లమల ఆనంద్, నంబూరి సత్యనారాయణ ప్రసాద్, తుమ్మలపల్లి నాగేశ్వరరావు, డాక్టర్ పోతినేని భూమేశ్వరరావు, కోలేటి నవీన్, తాళ్ళూరి మురళీకృష్ణ, బండి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


నారాయణపురంలో మంత్రి పొంగులేటి గృహ ప్రవేశానికి విచ్చేసిన మంత్రి తుమ్మల, ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు, తదితరులు

## నారాయణపురంలో సందడి

మంత్రి పొంగులేటి గృహ ప్రవేశానికి హాజరైన ప్రముఖులు
మంత్రి తుమ్మల, ఎంపీ రఘురాంరెడ్డి, పలువురు ఎమ్మెల్మేలు, కార్పొరేషన్ చైర్మన్లు

కల్లూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నారాయణపురం గ్రామంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గృహ ప్రవేశ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి ఆహ్వానం మేరకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రఘురాంరెడ్డి, ఉమ్మడి జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు విచ్చేయడంతో అట్టహాసంగా దసరా పండుగ వాతరవరణ కనిపించింది. గృహప్రవేశ కార్యక్రమంలో భాగంగా మంత్రి పొంగులేటి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. దసరా పండుగ రోజునే మంత్రి పొంగులేటి గృహప్రవేశం జరపటంతో ఆ ఆహ్వానాన్ని మన్నించి మంత్రి తుమ్మల, ఎంపీ రఘురాం రెడ్డి, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, సత్తుపల్లి ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, మట్టా రాగమయి, రాష్ట్ర ఐడీసీ, గిడ్డంగుల కార్పొరేషన్ల చైర్మన్లు మువ్వా విజయబాబు, రాయల నాగేశ్వరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు మట్టా దయానంద్, బేబి స్వర్ణకుమారితో పాటుగా పలువురు ప్రముఖులు, అధికారులు, అభిమానులు, పార్టీ శ్రేణులు తరలిరావటంతో నాయరాణపురం దసరా పండుగతో కళకళలాడింది. తమ ఆహ్వానాన్ని మన్నించి పై విధంగా నూతన గృహ ప్రవేశానికి విచ్చేసిన ప్రముఖులను మంత్రి శ్రీనివాసరెడ్డి శాలువలతో సత్కరించి అభినందించారు.

## ఘనంగా గాంధీ జయంతి

మధిర, అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మగాంధీ జయంతిని మధిరలో గురువారం ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క గాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. అహింసా పద్ధతిలో దేశానికి స్వాతంత్ర్యం తెచ్చి గాంధీజీ ప్రపంచానికి కొత్త పోరాట మార్గాన్ని సూచించారన్నారు.


గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

## నేడు లింగాలపల్లిలో పామాయిల్ రైతుల ఆత్మీయ సమ్మేళనం

దమ్మపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆయిల్‌ఫామ్ ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పాయిల్ రైతుల ఆత్మీయ సమ్మేళనం దమ్మపేట మండలం లింగాల గ్రామంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు ఆలపాటి రామచంద్రప్రసాద్ శుక్రవారం తెలిపారు. లింగాలపల్లి గ్రామసమీపంలోని మద్దినేని కోటయ్య (వెంకట్) పామాయిల్ వ్యవసాయ క్షేత్రంలో ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వారావుపేట, సత్తుపల్లి, కొత్తగూడెం ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, మట్టా రాగమయి, కూనంనేని సాంబశివరావు, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, పాల్గొనున్నారు. పామాయిల్ రైతులు అధిక సంఖ్యలో పాల్గొని ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

## రాజ్యాంగ హక్కులను రాష్ట్ర ప్రభుత్వం కాలరాస్తోంది

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు


సమావేశంలో మాట్లాడుతున్న బూర్గుల వెంకటేశ్వర్లు

మణుగూరు అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగం దళితులకు ఇచ్చినహక్కులను కాలరాసే విధంగా రిజర్వేషన్లు ప్రకటించిందని దళితులకు తీరని అన్యాయం జరిగిదని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మణుగూరులో మాల మహానాడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మణుగూరు మండలంలో ఎస్సీ జనాభా 25 వేల మందిపైగా ఉందని రోటేషన్ సిస్టమ్‌లో ఎస్సీకి జడ్పీటీసీ స్థానం లభిస్తుందనుకుంటే మళ్లీ ఎస్టీకి కేటాయించడం శోచనీయమన్నారు. దీనిని మాల మహానాడు తీవ్రంగా ఖండిస్తోందన్నారు. మాల మహానాడు మండల గౌరవ అధ్యక్షుడు మద్దెల భద్రయ్య, అధ్యక్ష కార్యదర్శులు వేర్పుల నరేష్, బూర్గుల సతీష్, వర్కింగ్ ప్రెసిడెంట్ వేర్పుల సురేష్, ఉపాధ్యక్షులు బూర్గుల సంజీవ రావు, ముల్క నరేస్, సబ్బతి ఏసురత్నం , వేమూరి రవి, ఉల్లోజు బాబి, బూర్గల వెంకటరత్నం, శంకర్ , దాసరి వెంకట్ పాల్గొన్నారు.

## అండర్-14, 17 ఉమ్మడి జిల్లా బాక్సింగ్ ఎంపికలు

జిల్లా సెక్రటరీ నరేష్ కుమార్

చుంచుపల్లి, అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ అండర్ -14, 17 బాల, బాలికల ఉమ్మడి ఖమ్మం జిల్లా బాక్సింగ్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సెక్రటరీ వాసిరెడ్డి నరేష్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10, 11, 12 తేదీల్లో హనుమకొండ నందు జరిగే రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఉమ్మడి జిల్లా స్థాయిలో ఎంపికలు చేపట్టినట్లు పేర్కొన్నారు. కొత్తగూడెంలోని సీఈఆర్ క్లబ్ బాక్సింగ్ రింగ్‌లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాల గౌరవ విద్యాశాఖ అధికారులు బి.నాగలక్ష్మి, ఏసీఎల్‌బీ శ్రీజ హాజరుకానున్నారని తెలిపారు. అండర్- 14 క్రీడాకారులు 6వ తరగతి నుంచి ఆ పైన చదువుతూ 2012 జనవరి 01 తరువాత జన్మించిన వారు, అండర్-17 క్రీడాకారులు 2009 జనవరి 01 తరువాత జన్మించిన వారై ఉండాలి. అలాగే 6వ తరగతి నుంచి ఇంటర్ ప్రథమ, ద్వితీయ తరగతులు చదువుతుండాలి. వీరు ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపికలకు ఉదయం 9 గంటలకు సకాలంలో పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 9951274678 ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలరని కోరారు.

## తెలంగాణ జాగృతి భద్రాద్రి జిల్లా అధ్యక్షుడిగా వీరన్న

కొత్తగూడెం టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడిగా డి.వీరన్నను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నూతన అధ్యక్షుడిగా నియమితులైన వీరన్న కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడిగా తనపై నమ్మకంతో నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో తెలంగాణ జాగృతిని మరింత బలోపేతం చేస్తానని ప్రకటించారు. సమావేశంలో జాగృతి నాయకులు రాంబాబు, రాజేందర్ నాయక్, సురేష్, సునిత , ఆదినారాయణ, సుగుణ, విజయ్, దేవిప్రసాద్, రాంబాబు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## తీర్పుపై ఉత్కంఠ

(5వ పేజీ తరువాయి)

ఆశిస్తున్నవారి సంఖ్యతక్కువగా ఉన్నారు. స్థానిక ఎన్నికల్లోపోటీ చేద్దామని చాలామంది సిద్ధమైనా రిజర్వేషన్లప్రక్రియ అనంతరం ఓసీవర్గాల నేతలు డీలాపడ్డారు. జనరల్‌కు రిజర్వు అయిన సీట్లలో.. ఓసీ ఓటుబ్యాంకు తక్కువగా ఉండటం, ఇతరవర్గాల ఓట్లు అధికంగా ఉన్నచోట జనరల్‌కు రిజర్వు అవడంతో వారంతా నైరాశ్యానికి గురయ్యారు. గిరిజనతండాల్లో 90శాతం ఉన్నచోట జనరల్ సర్పంచ్ ఎంపీటీసీలు రిజర్వు కావడంతో ఓసీనాయకులు జనరల్ సీట్లలో పోటీ చేయడానికి భయపడే పరిస్థితి. అక్కడ గిరిజన సామాజికవర్గం ఓట్లు ఎక్కువగా ఉంటేఓసీవర్గం నాయకులు ఓడిపోయే అవకాశం ఉంది. దీంతో అటు గిరిజనుల్లోనూ కొన్నిచోట్ల వ్యతిరేకత వ్యక్తమవుతోంది.తమఓట్లు అధికంగా ఉన్న పంచాయతీలను బీసీలు, జనరల్‌కు కేటాయించారని తండాలవాసులు ఆరోపిస్తున్నారు.

**విజయమే లక్ష్యంగా అధికార పార్టీ వ్యూహాలు..**

ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో తమ పార్టీ కేడర్‌ను ఎన్నికలకు సిద్ధం చేస్తున్నారు. ఎవరికివారు తమనియోజకవర్గాల్లో ఏకగ్రీవం చేయించుకునేలా, విజయమే లక్ష్యంగా కిందిస్థాయి కార్యకర్తలకు సూచిస్తున్నారు. తొలుత జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు, ఆతర్వాత గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగబోతుండటం, హైకోర్టు తీర్పు పై తర్జనభర్జనలు ఉన్న నేపథ్యంలో మరింత జాగ్రత్తగా ఉండాలని దిశానిర్దేశం చేస్తున్నారు. మొదటి విడత ఎన్నికలు జరిగే మండలాలపై దృష్టి సారించాలని కేడర్‌కు చెబుతున్నారు. అయితే కాంగ్రెస్ అధిష్ఠానం 5వతేదీలోపు ఉమ్మడిజిల్లాలో జడ్పీటీసీ అభ్యర్థిత్వాలు ఆశిస్తున్న వారి నుంచి మండలానికి ముగ్గురి పేర్లను పంపాలని సూచించింది. దీనికి అనుగుణంగా జాబితాలు కూడా సిద్ధంచేస్తున్నారు.

## హెచ్‌ఎం, సైన్సు ఉపాధ్యాయులకు వీడియో కాన్ఫరెన్స్

కొత్తగూడెంఎడ్యుకేషన్, అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి): ఆజాద్‌కా అమృత మహోత్సవం దేశవ్యాప్తంగా పాఠశాల విద్యార్థుల్లో ఆవిష్కరణలను ప్రోత్సహించే వికసిత్ భారత్ బిల్డథాన్- 2025ను ప్రారంభించిందని కేంద్ర విద్యాశాఖ డిప్యూటీ కార్యదర్శి లింగరాజు పాండే అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులకు శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓరియంటేషన్ ప్రోగాం నిర్వహించారు. భారత్ బిల్డథాన్- 2025ను వివరించారు.


ఆకట్టుకుంటున్న స్టాళ్లు

## కోటమైసమ్మ జాతర ప్రారంభం

- భారీగా తరలివస్తున్న జనం
- సందడిగా మారిన ఉసిరికాయలపల్లి
- అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కనకయ్య, ఎమ్మెల్సీ తాతా మధు

కారేపల్లి, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): ఐదు రోజుల పాటు రేయింబవళ్లు సాగే కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లిలో కొలుదీరిన శ్రీకోటమైసమ్మతల్లి జాతర మొదలైంది. ప్రతీ ఏడాది దసరా పండుగ సందర్భంగా జరిగే ఈ సంబురం.. గురువారం ఘనంగా ప్రారంభమైంది. వివిధ జిల్లాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. తొలిరోజు గురువారం లక్షమందికి పైగా భక్తులు తరలివచ్చారని, రెండో రోజైన శుక్రవారం కూడా అదేస్థాయిలో భక్తులు తరలొచ్చారని అంచనా. నిర్వాహకులు జాతరలో ఏర్పాటు చేసిన విద్యుత్ సౌకర్యంలో పదేపదే అంతరాయం కలగడంతో వ్యాపారులు, భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జాతరలో పెద్దలకు, చిన్నారులకు చేసిన పలు స్టాళ్లు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. జాతరలో సందడి చేస్తూ ఆనందంగా గడుపుతున్నారు. శుక్రవారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఖమ్మం ఎమ్మెల్సీ తాతా మధుసూధన్, ఇల్లెందు మున్సిపల్ మాజీ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు దంపతులు, జిల్లా నాయకులు ముత్యాల వెంకటప్పారావు దర్శించుకున్నారు. వారికి ట్రస్ట్ బోర్డు చైర్మన్ పర్సా పట్టాభిరామారావు, ఆలయ పూజారి కైలాష్ శర్మ ఘనస్వాగతం పలికారు. ఇకజాతరలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో 150మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

**ధరలు పెంచిన స్టాళ్ల నిర్వహకులు**

జాతరలో ఏర్పాటు చేసిన జెయింట్ వీల్స్ బ్రేక్‌డ్యాన్స్, పడవ విన్యాసం లాంటి అనేక స్టాళ్ల నిర్వాహకులు టికెట్ ధరలను భారీగా పెంచారు. ఒక్కొక్కరికి రూ.100పెంచి దండుకుంటున్నారని భక్తులుమండిపడ్డారు. ధరలు పెంచిన విషయంపై జాతర నిర్వాహకులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆగ్రహంవ్యక్తం చేస్తున్నారు.గతంలో ఎన్నడూ లేనివిధంగా ధర పెంచడంతో ఈ సారి ఆయా స్టాళ్ల వద్ద జనం కనిపించడం లేదు.


కోటమైసమ్మతల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే కనకయ్య


అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ మధు


ఆలయంలో భక్తులు

## తోడేళ్లను వదిలి.. కుందేళ్లపై వేటు!

- అవినీతిలో తప్పించుకుంటున్న పైస్థాయి అధికారులు
- 9మంది ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు
- పూర్తిస్థాయిలో విచారణ చేస్తాం: సిద్ధార్థ విక్రమ్ సింగ్,డీఎఫ్‌వో

ఖమ్మంసంక్షేమవిభాగం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా అటవీశాఖలో రెండేళ్లుగా సమూల ప్రక్షాళన దిశగా అడుగులు పడుతున్నాయి. అటవీ భూముల రక్షణ నుంచి అటవీ జంతువులు, సంపద సంరక్షణతో పాటుగా అటవీ సంరక్షణ సంఘాలకు సరైన ఉపాధి మార్గాలను చూపుతూ జిల్లా అటవీశాఖ అధికారి సిద్దార్థ విక్రమ్‌సింగ్ తనదైన పనితీరును కనబరుస్తున్నారు. ప్రక్షాళనలో భాగంగా కేవలం రెండేళ్ల కాలంలోనే 9 మంది ఉద్యోగులపై వేటు వేశారు. కానీ పైస్థాయిలో పర్యవేక్షణ చేయాల్సిన అధికారుల బాధ్యతా రాహిత్యం, పరోక్షంగా అవినీతికి సహకారంపై మాత్రం చర్యలు తీసుకోలేకపోతున్నారు. దీంతో ఇప్పుడు ఖమ్మం జిల్లా అటవీశాఖ జాతీయ స్థాయిలో అపకీర్తిని మూటగట్టుకుంటుంది. ఒక వైపు వరస సస్పెన్షన్‌లు జరుగుతున్న మరో వైపు అవినీతి అక్రమాలు ఆగటం లేదు.

**రెండేళ్లలో 9 మందిపై వేటు**

ఉమ్మడి ఖమ్మంజిల్లా అటవీశాఖలో ఎన్నడూ లేని విధంగా రెండేళ్లలో తొమ్మిది ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు పడింది. కొణిజర్ల మండలంలో చీమలపాడు బీట్‌లో డబ్బులు వసూళ్లు చేస్తున్నారని ఓ బీట్ అఫీసర్‌ను సస్పెండ్ చేశారు. తర్వాత కారేపల్లి మండలంలోని పాటిమీద గుంపు, చీమలపాడు, ఏన్కూరు మండలంలో తిమ్మరావుపేట ప్రాంతాల్లో అవినీతి, అటవీభూములు అక్రమణ, బోర్లు నిర్మాణానికి సహకరించిన ఐదుగురు ఉద్యోగులపై దశలవారీగా వేటు వేశారు. ఖమ్మం అర్బన్‌లో నిబంధనలకు విరుద్ధంగా వృక్షాలను నరికించారని డీఆర్వోను సైతం సస్పెండ్ చేశారు.అటవీహక్కుల భూములకు దొంగ పట్టాల అందించేందుకు సహకరించారని మరో ఉద్యోగిపై వేట పడింది. సత్తుపల్లి డివిజన్‌లోను ఓ డీఆర్వో సెలవ్‌పై వెళ్లి సస్పెన్షన్ వేటునుంచి తప్పించుకున్నారు. తాజాగా చింతకాని మండలంలోని బీట్‌ఆఫీసర్‌ను సస్పెండ్ చేశారు.

**కిందిస్థాయి అధికారులపైనే చర్యలు**

జిల్లా అటవీశాఖలో ఏదైనా అవినీతి అక్రమాలు, అటవీభూముల అక్రమణలు జరిగితే కేవలంకిందిస్థాయిలోని అధికారులపైనే చర్యలు తీసుకుంటున్నారని విమర్శలు వెలువడుతున్నాయి. బీట్ ఆఫీసర్ల స్థాయికి మించిన అనుమతుల జారీలో పైస్థాయి అధికారుల పరోక్ష సహకారం ఉంటుంది. అయితే చర్యలు తీసుకునే సమయంలో మాత్రం కింది స్థాయిలోని ఉద్యోగులను వత్తిడి చేసి ఆ తప్పిదాలకు తామే కారణమంటూ వారితోనే వాంగ్మూలం చేయిస్తున్నారు. ఇలా చేస్తే సస్పెన్షన్ సమయం తర్వాత తిగిరి ఉద్యోగంలో చేరే సమయంలో సహకరిస్తామని చెపుతున్నట్లు ఆరోపణలు వ్యాపిస్తున్నాయి. ఖమ్మం అర్బన్‌లో జరిగిన డీఆర్వో సస్పెన్షన్ విషయంలోను ఆ సమయంలో పని చేసిన పై స్థాయి అధికారి పాత్ర ఉన్నట్లుశాఖాపరంగా పెద్ద చర్చ జరిగింది. కాని ఆమెపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇటీవల చింతకాని మండలంలో చోటు చేసుకున్న విషయంలోను కేవలం బీట్‌ఆఫీసర్‌ను సస్పెండ్ చేశారు. కానీ పైస్థాయిలోని అధికారులపాత్రపై లోతైనా విచారణ చేపట్టాలని డిమాండ్ పెరుగుతుంది.

**మైదాన ప్రాంతంలో కొత్త రకం అవినీతి**

ఖమ్మం రేంజ్‌లో మైదాన ప్రాంతం ఎక్కువగా ఉంటుంది. రైతులు తమ వ్యవసాయ భూముల్లో పెంచిన వృక్షాలను అటవీశాఖ అనుమతుల ద్వారా తొలగించే సమయంలో మాత్రం ఎక్కువ వృక్షాలను తొలగించి తక్కువ వృక్షాలకు అనుమతులు జారీ చేయటం వంటి అవినీతి గతంలో ఉండేది. కానీ ఇప్పుడు మైదాన ప్రాంతంలోని భూముల పట్టాలు రైతుల పేర్లతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అక్రమ కలప వ్యాపారులకు అనుమతులు ఇవ్వటం అటవీశాఖలో ఉలిక్కిపాటుకు గురిచేసింది. దశాబ్దాల చరిత్ర కలిగిన ఖమ్మం అటవీశాఖలో ఇటువంటి అవినీతి ఎన్నడూ చూడలేదని తోటి అధికారులే నివ్వెరపోతున్నారు.

### ఉపేక్షించేది లేదు

**సిద్దార్థ విక్రమ్ సింగ్, జిల్లా అటవీశాఖ అధికారి**

అటవీభూములు, అటవీ సంపద రక్షణ విషయంలో ఎవ్వర్ని ఉపేక్షించేది లేదు. పారదర్శకంగా జిల్లా అటవీశాఖలో పరిపాలన కొనసాగుతోంది. అవినీతికి సహకరించిన వారిపై చర్యలు తీసుకుంటాం. పూర్తిస్థాయిలో విచారణ చేస్తాం. తాజాగా జరిగిన నేషనల్ పర్మిట్ మంజూరులో చాలా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నాం. సూర్యాపేట, మహబూబాద్ పక్క జిల్లాల చెక్‌పోస్టుల నుంచి సమాచారం సేకరిస్తున్నాం.

## పెట్రోలియం సహజ వాయువు స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా వద్దిరాజు

ఖమ్మంఖానాపురం హవేలి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి):పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీల నియామక ప్రక్రియలో భాగంగా రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మరోసారి పెట్రోలియం మరియు సహజ వాయువు స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈమేరకు లోక్‌సభ డిప్యూటీ సెక్రటరీ సుజయ్ కుమార్ శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 31 మంది సభ్యులు గల ఈ కమిటీలో లోక్‌సభ నుంచి 21మంది రాజ్యసభ నుంచి 10 మంది ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తారు. ప్రతి రెండెళ్లకోసారి నియామకం అయ్యే ఈ కమిటీకి రవిచంద్ర వరుసగా మూడోసారి సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ దఫా పెట్రోలియం మరియు సహజ వాయువు స్టాండింగ్ కమిటీకి చైర్మన్‌గా లోక్‌సభ ఎంపీ సునీల్ దత్తాత్రేయ తట్కరే కొత్తగా ఎన్నికయ్యారు.

## నయా ఉదారవాదమే కార్మిక ఐక్యతకు విఘాతం

సీఐటీయూ అఖిలభారత కోశాధికారి సాయిబాబు


మాట్లాడుతున్న సాయిబాబు

ఖమ్మంఅర్బన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పెట్టుబడి దారి పాలకులు అమలు చేస్తున్న నయాఉదారవాదమే కార్మిక వర్గాల ఐక్యతకు విఘాతం కలిగిస్తోందని సీఐటీయూ అఖిలభారత కోశాధికారి మందలపు సాయిబాబు అన్నారు. శుక్రవారం ఖమ్మంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్‌ట్రేడ్ యూనియన్స్(డబ్లూటీఎఫ్) 80వ వార్షికోత్సవ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడు తుమ్మావిష్ణు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ క్యూబా, ఇరాన్, పాలస్తీనా, దేశాలకు డబ్లూటీఎఫ్ అండగా నిలిచిందన్నారు. ప్రపంచ కార్మికుల ఐక్యతకు సింహస్వప్నంగా మారిందన్నారు. భారతదేశంలో పాలకులు కులం, మతం ప్రాంతం పేరుతో కార్మికులను విడదీసి దోచుకుంటున్నారని చెప్పారు. అటువంటి విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు పోరాడాలన్నారు. కార్మికులు ఐక్యతతో ఎర్రజెండా అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడుచలమాల విఠల్‌రావు, మల్సూరు, చంద్రశేఖర్, శీలం నరసింమరావు తదితరులు పాల్గొన్నారు.

# దసరా వైభవం..



ఖమ్మం నగరంలోని జమ్మిబండ వద్ద పోలీసుల బందోబస్తు

- ఉమ్మడి జిల్లాలో ఘనంగా విజయదశమి వేడుకలు
- ఉత్సవాలకు పోటెత్తిన భక్తులు.. సందడిగా ఆలయాలు
- ఖమ్మంలో జమ్మిబండ వద్ద పారువేట
- స్థంభాద్రి లక్ష్మీనర్సింహస్వామికి ప్రత్యేక పూజలు
- హాజరైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఇల్లెందు జేకే కాలనీలో రావణదహన కార్యక్రమం
- పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం ఖానాపురంహవేలి / ఇల్లెందు / కొత్తగూడెం సాంస్కృతికం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దసరా వేడుకలు ఉమ్మడిజిల్లాలో గురువారం వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి భక్తుల రాకతో ఆలయాలు సందడిగా కనిపించాయి. ఇక సాయంత్రం సమయంలో నిర్వహించిన పారువేట, శమీపూజలు, రావణదహనం తదితర ప్రత్యేక కార్యక్రమాలు అట్టహాసంగా సాగాయి. గురువారం సాయంత్రం 5గంటలకు గుట్ట నుంచి స్వామివారు ప్రత్యేక పల్లకీలో ఊరేగింపుగా జమ్మిబండకు చేరుకోగా.. వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. అలాగే అక్కడ ప్రతిష్ఠించిన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు తమ కోర్కెలను పేపర్లపై రాసి జమ్మిచెట్టు కొమ్మలకు కట్టి మొక్కుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరాగా.. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. అలాగే పోలీసులు పటిష్ఠ భద్రతను ఏర్పాటు చేశారు.

### జమ్మిబండ అభివృద్ధికి కృషి : మంత్రి తుమ్మల

ఖమ్మం జమ్మిబండ వద్ద నిర్వహించే పారువేట కార్యక్రమానికి ఎంతో ప్రాధాన్యముందని, రానున్న రోజుల్లో జమ్మిబండ విస్తరణకు, అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంతి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. గురువారం సాయంత్రం జమ్మిబండ వద్ద జరిగిన పారువేటకు హాజరైన ఆయన స్థంభాద్రి లక్ష్మీ నృసింహస్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రికి ఆలయ అర్చకులు, ఈవో జగన్‌మోహన్‌రావు, స్థానిక ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, ఉప మేయర్ ఫాతిమా జోహార, నాయకులు పాల్గొన్నారు.

### ఇల్లెందు ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి పొంగులేటి

దసరా సందర్భంగా ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో జేకే కాలనీ సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన దసరా వేడుకలు అట్టహాసంగా జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది తరలొచ్చారు. ఈ వేడుకలకు హాజరైన రాష్ట్ర గృహ నిర్మాణ రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇల్లెందులో దసరా వేడుకలను వైభవంగా నిర్వహించడం హర్షణీయమన్నారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో అనేక సంక్షమ పథకాలు అమలు జరుగుతున్నాయని, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉన్నారన్నారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ.. ఇల్లెందు నియోజక వర్గం అభివృద్ధికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనేక కార్యక్రమాలను పథకాలను మంజూరు చేశారని, ఆయన చేస్తున్న కృషిని ప్రజలు విస్మరించవద్దని ఆయన నాయకత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఈ వేడుకల్లో జబర్దస్త్ కళాకారులు హైపర్ ఆది, వినోదిని బృందం ప్రదర్శనలు, సినీ సంగీత విభావరి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు తుళ్లూరి బ్రహ్మయ్య, మాజీ మునిసిపల్ చైర్మన్లు మడత రమా వెంకట్ గౌడ్, దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, సింగరేణి జనరల్ మేనేజర్ కృష్ణయ్య, డీఎస్పీ చంద్రభాను, మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు యంత్రాగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసింది.



వేడుకలకు హాజరైన జనసందోహం



భట్టి దంపతులకు ఆశీర్వదిస్తున్న అర్చకుడు

## దసరా ఉత్సవాల్లో డిప్యూటీ సీఎం

మధిర, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మధిరలో జరిగిన దసర ఉత్సవాల్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దంపతులు గురువారం పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం బంజారా కాలనీ శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన శమీపూజలో భట్టి దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, వడ్డే నారాయణ, పుచ్చకాయల వీరభద్రం స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### నేడు అమ్మవారి ఊరేగింపు, నిమజ్జనం

ఉమ్మడి జిల్లాలో దుర్గాదేవి అమ్మవారి ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమాలను శనివారం నిర్వహించనున్నారు. ఖమ్మంలోని కాల్వొడ్డు, ప్రకాష్‌నగర్ వద్ద మున్నేరులో నిమజ్జనాలు చేయనున్నారు. ఈ ప్రాంతాల్లో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గజ ఈతగాళ్లను మోహరించారు. ఖమ్మం జమ్మిబండ వద్ద ప్రతిష్ఠించిన అమ్మవారి ఊరేగింపు శనివారం సాయంత్రం 5గంటలకు ప్రారంభమవుతుందని ఈవో జగన్‌మోహన్ రావు తెలిపారు. ఈ నేపథ్యంలో ఉదయం మండపం వద్ద మహాఅన్నదానం నిర్వహించనున్నట్టు ఈవో తెలిపారు.

### బాణసంచాతో రావణ దహనాలు

కొత్తగూడెం రైటర్ బస్తీలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో రావణదహన కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. అనంతరం జమ్మి చెట్టుకు శమీపూజలు నిర్వహించి కోర్కెలు తీరాలని ఆకాంక్షించారు. విజయదశమిని పురస్కరించుకుని దుర్గాదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, నూతన వాహనాలకు ఇతరత్ర ఆయుధాలకు పూజలు జరిపారు. అనంతరం దుర్గాదేవి శోభాయాత్రను నిర్వహించి భద్రాచలం గోదావరిలో అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు. పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సింగరేణి ఎస్‌ఓటూ జీఎం కోటిరెడ్డి, సింగరేణి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు.



జమ్మిబండ వద్ద నృసింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

# దక్షిణ అయోధ్యలో.. విజయోత్సవం

- భద్రాద్రి రామయ్యకు మహాపట్టాభిషేకం
- ఆకట్టుకున్న శ్రీ రామ్‌లీలా మహోత్సవం
- బాణం సంధించిన దేవస్థానం ఈవో దామోదర్‌రావు

భద్రాచలం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలం పుణ్యక్షేత్రంలో విజయదశమిని పురస్కరించుకొని పలు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గురువారం తొలుత రామచంద్రమూర్తికి కల్యాణం, ఘనంగా సర్వవిధ రాజలాంఛనాలతో మహా పట్టాభిషేకం నిర్వహించారు. అలాగే లక్ష్మీతాయారు అమ్మవారికి ప్రత్యేక స్నపనం, విశేష అలంకారం నిర్వహించారు.

### సకలవిధ లాంఛనాలతో పట్టాభిషేకం

సీతారామచంద్రస్వామికి తొలుత నిత్యకల్యాణాన్ని నిర్వహించి అనంతరం శ్రీరామాయణ పారాయణ సమాప్తిని పురస్కరించుకొని శ్రీరామ మహా పట్టాభిషేకాన్ని నిర్వహించారు. ఈ సమయంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కలశ స్థాపన, రామాయణంలోని పట్టాభిషేక ఘట్ట పారాయణం, కిరీట ధారణ, కలశ జలాలతో స్వామివారికి ప్రోక్షణ, వేదాశీర్వచనం, మంగళహారతి నిర్వహించారు. అదేవిధంగా దసరాను పురస్కరించుకొని పది రోజుల పాటు శ్రీమద్రామాయణ పారాయణం నిర్వహించే సమయంలో నిత్య హోమం నిర్వహించారు. కాగా చివరి రోజున పూర్ణాహుతి గావించారు.

### సంప్రదాయబద్ధంగా శమీపూజ

ఆలయంలో దర్బారు సేవ అనంతరం శ్రీ సీతా రామచంద్రస్వామి వారిని మేళతాళాలు, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య దసరా మండపానికి తీసుకొచ్చారు. మండపంలో స్వామివారిని ఆశీనులను చేసి ముందుగా శమీవృక్షం మొదలులో స్వామివారి ఆయుధాలైన ధనస్సు, బాణం, డాలు,కత్తి సుదర్శనం, గద తదితర ఆయుధాలను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శమీపత్రాలను సేకరించి స్వామివారికి విశేష అర్చన నిర్వహించారు. దీంతో స్వామివారి విజయోత్సవం ఘనంగా జరిగింది. ఈ క్రమంలో మండప ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శ్రీరామలీలా మహోత్సవంలో భాగంగా రావణాసురుడి బొమ్మకు దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు బాణాన్ని సంధించి.. రావణ దహనం గావించారు. చివరగా సీతారామచంద్రస్వామి వారిని మేళతాళాలతో రామాలయానికి తిరువీధి సేవగా తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఈవో కె.దామోదర్‌రావు దంపతులు, ఇంజనీరింగ్ ఈఈ వి.రవీంద్రనాథ్, ఏఈవోలు శ్రావణ్ కుమార్, భవానీరామకృష్ణారావు, పర్యవేక్షకులు కత్తి శ్రీనివాస్, లింగాల సాయిబాబా, కిషోర్, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, ఉప ప్రధాన అర్చకులు కోటి శ్రీమన్నారాయణాచార్యులు, అమరవాది మురళీకృష్ణమాచార్యులు, అమరవాది గోపాలకృష్ణమాచార్యులు, ముఖ్య అర్చకులు అమరవాది మధుసూదనాచార్యులు, వైదిక పరిపాలన బృందం పాల్గొన్నారు.



శమీపూజ నిర్వహిస్తున్న దృశ్యం



దహనమవుతున్న రావణాసురుడి బొమ్మ

## గోదావరి నదిలో అమ్మవారి విగ్రహాల నిమజ్జనం

తొమ్మిది రోజుల పాటు భక్తులచే పూజలందుకున్న అమ్మవారి విగ్రహాలను భక్తులు భద్రాచలంలోని పవిత్ర గోదావరిలో నిమజ్జనం చేశారు. గత రెండు రోజులుగా భద్రాచలంకు వివిధ ప్రాంతాల నుంచి అమ్మవారి విగ్రహాలు నిమజ్జనం నిమిత్తం తరలివచ్చాయి. వాటిని నిమజ్జన ఘాట్ వద్ద సంబంధిత సిబ్బంది క్రేన్ల ద్వారా లాంచీల్లోకి తరలించి నిమజ్జనం నిర్వహించారు. గురు, శుక్రవారాల్లో 170 విగ్రహాలు వచ్చాయి. రెవెన్యూ, పంచాయతీ, నీటిపారుదల, పోలీసు శాఖ, రవాణ శాఖ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



నిమజ్జనంకు లాంచీపైకి ఎక్కిస్తున్న విగ్రహాలు

## పామాయిల్ గెలల సేకరణ కేంద్రం ఏర్పాటు

**పామాయిల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రామచంద్రప్రసాద్**



పామాయిల్ సేకరణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆలపాటి రామచంద్రప్రసాద్


ములకలపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురం గ్రామంలో ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో పామాయిల్ గెలల సేకరణ కేంద్రాన్ని గురువారం పామాయిల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రామచంద్రప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ములకలపల్లి తదితర ప్రాంత రైతులు అప్పారావుపేట కర్మాగారానికి గెలలను పంపించాలంటే చాల కష్టతరంగా మారిందని, వారి సమస్యను గుర్తించి పామాయిల్ గెలల సేకరణ కేంద్రంను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. సేకరణ కేంద్రం ఇన్‌చార్జ్ కాసాని నాగప్రసాద్‌ను ఆలపాటి అభినందించారు. ఈ కార్యక్రమంలో కొయ్యల అచ్యుతరావు, కేవీ సత్యనారాయణ, దమ్మపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వాసం రాణి, తాండ్ర ప్రభాకరరావు, అమరనాథ్, బత్తుల అంజి, కారం సుధీర్, పామర్తి వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయిన విద్యార్థి

చంద్రుగొండ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): చదువుకునేందుకు కాలేజీకి వెళ్లమని తండ్రి మందలించటంతో మనస్తాపంతో విద్యార్థి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన మండలంలోని అన్నారం తండాలో చోటు చేసుకుంది. ఈ ఘటనపై గురువారం స్థానిక ఎస్ఐ శివరామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం గుండాల గురుకులంలో ఇంటర్ మొదటి ఏడాది చదువుతున్న నునావత్ శ్రీధర్ వినాయక చవితి పండుగ సెలవులకు ఇంటికి వచ్చాడు. అనంతరం సెలవులు ముగిసినా శ్రీధర్ కాలేజీకి వెళ్లలేదు. కాగా దసరా అనంతరం కాలేజీకి వెళ్లాలని తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన విద్యార్థి ఈ నెల 1వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడు తండ్రి హతీరామ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

## ఓ రౌడీషీటర్‌పై ఇద్దరు రౌడీషీటర్ల దాడి

**కేసు నమోదు చేసిన పోలీసులు**



తీవ్రంగా గాయపడిన గోలేపు గణేష్

ఖమ్మంక్రైం, అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి): ఓ రౌడీషీటర్‌పై ఇద్దరు రౌడీషీటర్లు దాడిచేసి గాయపరిచిన సంఘటన గురువారం ఖమ్మం నగరంలో జరిగింది. ఖానాపు రంహవేలి పోలీసుల కథనం ప్రకారం ఇల్లెందుకు చెందిన రౌడీషీటర్ జేకే మహేష్, ఖమ్మం కాల్వొడ్డుకు చెందిన రౌడీషీటర్ భద్రుల్లాలు కలిసి నగరంలోని శ్రీనగర్‌కాలనీ రోడ్డు నెంబరు 16లో నివాసం ఉంటున్న రౌడీషీటర్ గొల్లెపు గణేష్ ఇంటికి గురువారం మధ్యాహ్నం సమయంలో వెళ్లారు. పండగ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చామంటూ మొదట మాట్లాడారు. ఆతర్వాత అసభ్య పదజాలంతో దుర్భాషలాడుతూ వారివెంట తెచ్చుకున్న బీరు బాటిళ్లతో అతని తలపై కొట్టి తీవ్రంగా గాయపరిచారు. వచ్చిన వారికి తాను ప్రస్తుతం గొడవలకు పోవడంలేదని, వ్యాపారం చూసుకుంటూ భార్య, పిల్లలను పోషించుకుంటు నాన్నని చెప్పినా వినకుండా తీవ్రంగా కొట్టి గాయపరిచారు. అనంతరం చనిపోయాడనుకుని వారు వెళ్లిపోవడంతో కొద్దిసేపటికి స్పృహలోకి వచ్చిన గణేష్ ఫోన్ ద్వారా కుటుంబసభ్యులకు సమాచారం అందించాడు. వారు అక్కడకి వచ్చిన వెంటనే గణేష్‌ను ఖమ్మం నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించగా వైద్యులు అతనికి తగిన గాయాలకు కుట్లువేసి చికిత్స అందించారు. ఈ మేరకు దాడికి పాల్పడిన రౌడీషీటర్లు జేకే మహేష్, భద్రుల్లాపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు ఖానాపు రంహవేలి సీఐ భానుప్రకాష్ తెలిపారు. బాధితుడి ఇంటి సమీపంలో నిందితులు ముగ్గురు ఓ ఖాళీ ప్రదేశంలో మద్యం సేవించినట్లు తెలిసింది.

### బెట్టింగులు వద్దని మందలించినందుకు..

# అమ్మమ్మను హత్యచేసిన మనవడు

- మంచం కోడు, ఇంటి గచ్చుకు మోది హతమార్చిన వైనం
- టీవీ సౌండ్ పెంచి మరీ ఘాతుకం
- ఎర్రుపాలెం మండలం సఖినవీడులో ఘటన
- పోలీసుల అదుపులో నిందితుడు





పద్మ (ఫైల్), నిందితుడు సాయితేజ

ఎర్రుపాలెం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్‌లు యువతను మరింత దిగజార్చుతున్నాయని.. చివరకు రక్త సంబంధాలను కూడా లెక్క చేయకుండా తల్లిదండ్రులు, కుటుంబసభ్యులపై దాడులకు దిగుతున్నారన్న దానికి ఈ ఘటనే నిదర్శనం. ఈ తరహా ఘటన ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం సఖినవీడు గ్రామంలో భయానక వాతావరణాన్ని కలిగించింది. బెట్టింగులకు పాల్పడుతూ జులాయిగా మారిన మనవడిని మందలించి నందుకు.. ఆ మనవడు తన అమ్మమ్మను హతమార్చాడు. శుక్రవారం సఖిన వీడు గ్రామంలో జరిగిన ఈ దారుణ సంఘటనకు సంబంధించిన వివరాలివీ.. సఖినవీడు గ్రామానికి చెందిన శాకమూడి పద్మ(60)కు ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడు చనిపోవడంతో ఆమె కోడలు మనవరాలిని తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. దాంతో కూతురిపై ఆశలు పెట్టుకుని జీవిస్తున్న క్రమంలో కూతురు, అల్లుడు కూడా చనిపోయారు. కూతురు కుమారులు ఇద్దరిలో పెద్ద మనవడు తన నానమ్మ వాళ్ల ఇంట్లో ఉంటుండగా.. చిన్న మనవడైన 24ఏళ్ల వయసున్న చీరాల సాయితేజను తన దగ్గరే పెట్టుకుని మధిరలోని ఓ కళాశాలలో డిగ్రీ చదివిస్తోంది. తన పేరిట ఉన్న ఎకరన్నర పొలంలో వ్యవసాయం చేసుకుంటూ, నాలుగు పాడిగేదెలను పెంచుతూ జీవిస్తోంది. ఈక్రమంలో మనవడు సాయి కొంతకాలంగా చదువును పక్కన పెట్టిన ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటుపడ్డాడు. అతడిని మందలించే వారు లేకపోవడంతో ఇటీవల బెట్టింగ్‌లు మరింత పెరిగాయి. గమనించిన అమ్మమ్మ పద్మ బెట్టింగులు వద్దని, వాటిని మానేసి చదువు కోవాలని కొంతకాలం మందలిస్తూ వస్తోంది. ఈ క్రమంలో తరచూ సాయి తన అమ్మమ్మతో వాగ్వాదానికి దిగుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం సాయి అమ్మమ్మను ఖర్చులకు కావాలంటూ డబ్బులు అడగ్గా.. బెట్టింగులు మానేసి, మంచిగా చదువుకోవాలని పద్మ మనవడికి చెప్పింది. దాంతో సాయి ఆమెతో గొడవపడ్డాడు. ఆ గొడవ కాస్తా పెద్దది కాగా.. కోపంతో రగిలిపోయిన సాయి అమ్మమ్మ పద్మపై దాడి చేసి మంచం కోడుకు బలంగా కొట్టాడు. దాంతో ఆమె కేకలు వేయడంతో బయటకు వినిపిం చకుండా ఉండేందుకు టీవీ సౌండ్ పెద్దగా పెట్టి మరీ పద్మను గదిలో కింద పడేసి ఆమె తలను గచ్చుకు వేసి తీవ్రంగా కొట్టాడు. దీంతో ఆమె అక్కడి కక్కడే మృతిచెందింది. ఈలోపు స్థానికులు ఇచ్చిన సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ రమేష్‌కుమార్ నిందితుడు సాయితేజను అదుపులోకి తీసుకున్నారు. పద్మ మృతదేహాన్ని పోస్టుమార్టంకోసం మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి పద్మ సోదరుడు లంకా శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదు చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు

# బతుకమ్మ నిమజ్జన వేడుకల్లో అపశ్రుతులు

- రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి, పలువురిరికి గాయాలు
- భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలంలో ఘటన
- డ్యాన్స్ చేస్తూ డీజే శబ్దానికి ఆగిన యువకుడి గుండె
- బూర్గంపాడు మండలం లక్ష్మీపురంలో విషాదం
- కల్లూరు మండలం కప్పలబంధంలో శిలాఫలకాన్ని ఢీకొట్టిన ట్రాక్టర్
- గాయపడి చికిత్స పొందుతూ ప్రభుత్వ ఉపాధ్యాయుడి కన్నుమూత

బూర్గంపాడు / కల్లూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : బతుకమ్మ నిమజ్జన వేడుకల్లో అపశ్రుతులు దొర్లాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జరిగిన మూడు ఘటనల్లో ముగ్గురు కన్నుమూశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు అంబేద్కర్‌కాలనీ వాసులు ఈ బుధవారం రాత్రి గ్రామంలో బతుకమ్మ ఉరేగింపు నిర్వహించారు. ఉరేగింపు అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేయడానికి కాలనీలోని వేణుగోపాల్ అనే వ్యక్తికి చెందిన ట్రాక్టర్‌పై భద్రాచలం గోదావరికి బయలుదేరారు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున సారపాక వద్ద గోదావరి బ్రిడ్జిపై ఆట్రాక్టరును వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం బలంగా ఢీ కొట్టింది. దీంతో ట్రాక్టర్ ఇంజిన్, ట్రాలీ బోల్తాపడ్డాయి. పడింది. ఈ ప్రమాదంలో తోకల వెంకటరమణ(58) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా కొడారి లత, కేసుపాక లీలావతి, కొవ్వల సుజాత, కేసుపాక రాజేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను భద్రాచలం ఏరియా ఆస్పత్రికి, అనంతరం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతుడు వెంకటరమణ తాపీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. కుమార్తె స్వర్ణలత ఫిర్యాదుతో బూర్గంపాడు ఎస్ఐ ప్రసాద్ కేసు నమోదు చేసుకున్నారు.

### నృత్యం చేస్తుండగా గుండెపోటు.. యువకుడి మృతి

బతుకమ్మ ఊరేగింపులో నృత్యం చేస్తూ గుండెపోటుతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ విషాద సంఘటన భద్రాద్రికొత్తగూడెం జిల్లా లక్ష్మీపురం గ్రామంలో గురువారం జరిగింది. లక్ష్మీపురం గ్రామానికి చెందిన రమేష్(30) గురువారం రాత్రి గ్రామంలో జరిగిన బతుకమ్మల ఉరేగింపులో పాల్గొన్నాడు. డీజే పాటలకు అందరితో కలిసి ఉత్సాహంగా డ్యాన్స్ చేస్తూ.. కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే రమేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. అయితే యువకుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నారు.

### దిమ్మె మీద పడి ఉపాధ్యాయుడు..

ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలోని కప్పలబంధం గ్రామంలో గురువారం రాత్రి జరిగిన బతుకమ్మ ఊరేగింపులో అపశ్రుతి చోటు చేసుకుంది. బతుకమ్మలను ఊరేగించే సమయంలో ట్రాక్టర్‌ను రివర్స్ పెడుతుండగా రోడ్డు నిర్మాణం సమయంలో వేసిన శిలాఫలకాన్ని బలంగా ఢీకొట్టింది. ఆ సమయంలో శిలాఫలకం పక్కనే నిల్చున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు వేముల శ్రీనివాసరావు (48)పై శిలాఫలకం దిమ్మె శకలాలు పడ్డాయి. గాయాలైన ఆయన్ను వెంటనే కల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యంకోసం ఖమ్మం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున శ్రీనివాసరావు కన్నుమూశారు. ఈమేరకు కల్లూరు పోలీసులు కేసు నమోదుచేసుకున్నారు. శ్రీనివాసరావు కల్లూరు మండలంలోని రఘునాథగూడెం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ డిప్యూటేషన్‌పై ప్రస్తుతం కల్లూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. టీఎస్‌యూటీఎఫ్ కల్లూరు మండల కోశాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. దసరా పండుగ సందర్భంగా స్వగ్రామమైన కప్పలబంధంకు వెళ్లిన శ్రీనివాసరావు మృత్యువాతపడటం ఆకుటుంబంలో తీవ్రవిషాదాన్ని నింపింది. శ్రీనివాసరావు మృతికి యూటీఎఫ్, పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘాలు సంతాపం తెలిపాయి.

## సాగర్ కాలువలో పడి విద్యార్థి గల్లంతు



హర్షవర్ధన్(ఫైల్)

ఏన్కూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): సాగర్ కాలువలో పడి విద్యార్థి గల్లంతయిన ఘటన మండలంలోని రాజలింగాల గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ గ్రామానికి చెందిన బొమ్మనబోయిన హర్షవర్ధన్(15) పదో తరగతి చదవుతున్నాడు. దసరా పండుగకని ఏన్కూరు మండలం రాజ లింగాలలో అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. తాతయ్య, అమ్మమ్మ రామకోటయ్య, నాగమణిలతో ఉత్సాహంగా గడిపాడు. శుక్రవారం ఉదయం మేనమామ కుమారుడు సాయితో కలిసి గ్రామసమీపంలోని సాగర్ కాలువలోకి దిగారు. హర్షవర్ధన్ ప్రమాదశాత్తు కాలుజారి కాలవలో పడి గల్లంతయ్యాడు. ఈ విషయాన్ని బంధువులకు తెలపడంతో గ్రామస్తులు వచ్చి వెతికారు. కానీ దొరక్కపోవడంతో విద్యార్థి కోసం గ్రామస్తులు గాలిస్తున్నారు. తల్లిదండ్రులు దినేష్, కల్పనలకు ఇద్దరు సంతానం. వీరిలో పెద్దకుమారుడు హర్షవర్ధన్ కనిపించకపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సంధ్య సిబ్బందితో కలిసి గాలింపు చేపట్టారు.

## చేపలు పట్టేందుకు వెళ్లి మృత్యువాత

తల్లాడ, అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి కూలి పనులకు వచ్చిన వ్యక్తి చేపలు పట్టేందుకు వెళ్లి నీటమునిగి మృత్యువాత పడ్డాడు. ఈఘటన ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మల్లవరం గ్రామ సమీపంలోని వైరా రిజర్వాయర్ వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మధ్యప్రదేశ్ రాష్ట్రం బాలాగడ్ జిల్లా రుక్మా గ్రామానికి చెందిన బ్రజిలాల్(35) ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందాడు. రెండు నెలల క్రితం మల్లవరం గ్రామానికి చెందిన ఓ రైతు వద్ద వ్యవసాయ పనుల కోసం మధ్యప్రదేశ్ నుంచి కూలీలు వలసవచ్చారు. గతనెల 30వ తేదీ రాత్రి నలుగురు కూలీలు కలిసి వైరా రిజర్వాయర్‌లో చేపలు పట్టేందుకు వెళ్లారు. వీరిలో ముగ్గురు కూలీలు తిరిగి వచ్చారు. బ్రజిలాల్ తిరిగి రాకపోవడంతో వైరా రిజర్వాయర్‌లో గాలిస్తుండగా గురువారం శవమై కనిపించాడు. ఈమేరకు తల్లాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ ఎన్.వెంకటకృష్ణ కేసు నమోదుచేసి బ్రజిలాల్ మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్య

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): భార్యభర్తల మధ్య కలహాల నేపథ్యంలో భార్య ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన గురువారం సత్తుపల్లి మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కాకర్లపల్లికి చెందిన ఆటో డ్రైవర్ షేక్ రంజాన్‌వలీ భార్య సైదాబీ(37) ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి భర్తతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. అందిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

దమ్మపేట, అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు మూడు అంతస్తుల భవనంపై నుంచి కిందపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దమ్మపేటకు చెందిన రాయనపాటి కళ్యాణశేఖర్ (42), ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం కళ్యాణశేఖర్ తాను అద్దెకు నివాసం ఉంటున్న మూడంతస్తుల భవనం పైకి ఎక్కాడు. ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. వీరు ఏపిలోని గుడివాడకు చెందిన వారు కాగ ఐదు ఏళ్ల క్రితం ఇక్కడుకు వచ్చి ప్రైవేటు పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మృతుడి భార్య ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పని చేస్తుంది. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## బాధితుడి కుటుంబానికి ఆర్థికసాయం



కామేపల్లి, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పింజరమడుగు గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రాయల కోటయ్య కుటుంబానికి యూత్‌ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో రూ.5వేలు,25కేజీల బియ్యాన్ని వితరణగా శుక్రవారం అందజేశారు. గ్రామంలో పేదకుటుంబాలను ఆదుకుని వారికి సహాయం చేయడంలో ముందుంటామని అన్నారు. ఈకార్యక్రమంలో నరేష్, వేణు, పాపరావు, సామేలు, విజయ్‌కుమార్, వర్ధన్, ప్రవీణ్, శ్రీకాంత్, ఉదయ్, నవీన్, సురేష్ తదితరులు ఉన్నారు.



పంచపాండవులు విగ్రహాలు

## వైభవంగా పంచపాండవుల శోభాయాత్ర

- రెండు రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలు
- కామేపల్లి మండలం పింజరమడుగులో వేడుకలు

కామేపల్లి,అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పంచపాండవులు.... ధర్మరాజు, భీమసేనుడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు ఈపేర్లు మనం మహభారతంలో వినుంటాం!. పంచపాండవుల చరిత్ర పుస్తకాల్లో చదివాం.. కానీ పంచపాండవులు ఎలా ఉంటారో, వారి రూపాలు ఎవరికీ తెలియదు. కానీ ఖమ్మం జిల్లా కామేపల్లి మండలంలో పింజరమడుగు గ్రామంలో పంచపాడవుల రూపాలతో విగ్రహాలు, ఆలయం ఉందని ఉమ్మడి జిల్లాలో ఎవరికి తెలియదు. గ్రామంలో 200 ఏళ్ల నాటి పురాతన పంచపాండవుల దేవాలయం ఉంది. ఇక్కడ ఏటా విజయదశమి పర్వదినాన శ్రీక్రిష్ణ పంచపాండవుల విగ్రహాలను ఎంతో భక్తి శ్రద్ధలతో గ్రామంలో ఊరేగింపు చేస్తారు. విజయదశమిరోజు సాయంత్రం విగ్రహాలను రథంలో ఊరి చివర జమ్మిచెట్టు దగ్గరకు తీసుకెళ్లి అక్కడ పూజలు నిర్వహించారు. ఈ రెండు రోజులు సన్నాయి మేళంతో, మహిళలు, చిన్నారులు, పెద్దలు అందరు పాల్గొని నృత్యాలతో శోభయాత్ర ఘనంగా జరిపారు. ఈ ఉత్సవాలను చూసేందుకు మూడు, నాలుగు జిల్లా నుంచి భక్తులు వస్తారు. మరుసటిరోజు శోభయాత్ర అనంతరం ఆలయంలోకి ప్రవేశిస్తాయి. ఎనిమిదిక్రితం గ్రామప్రజలు, మత్స్య సొసైటీలో ఉండే సభ్యులు రూ.40లక్షలతో నూతన ఆలయనిర్మాణం చేపట్టారు. గతంలో కంటే ఈఏడాది శోభయాత్ర రథం చూపురులను ఆకట్టుకుంది.



## పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో ఆయుధపూజ

ఖమ్మంక్రైం,అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా నగరంలోని పోలీసుహెడ్‌క్వార్టర్స్‌లో పోలీసు ఆయుధాలకు పూజలు నిర్వహించారు. సీపీ సునీల్‌దత్ హాజరై ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. శక్తికి ప్రతీకగా నిలిచే దుర్గామాత సమక్షంలో ప్రతీ ఆయుధానికి ఎంతో శక్తి కలిగి ఉంటుందన్నారు.ఈకార్యక్రమంలో ఏడీసీపీలు రామానుజం, కుమారస్వామి, ఏసీపీలు మహస్త్రస్, సుశీల్‌సింగ్, ఆర్ఐలు కామరాజు, శ్రీశైలం, సురేష్, సాంబశివరావు, నాగుల్‌మీరా, సీఐ రామకృష్ణ పాల్గొన్నారు.

### ఘనంగా పారువేట

నేలకొండపల్లి: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం పారువేట, శమీపూజలు వైభవంగా నిర్వహించారు. గురువారం 12గంటల వరకు భక్తులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాహన పూజలు చేశారు. సాయంత్రం దేవతామూర్తులు పారువేటకు బయలుదేరి తహసీల్దార్ కార్యాలయం సమీపంలో కొలువు తీరగా వేలసంఖ్యలో భక్తులు సందర్శించుకున్నారు. అర్చకులు తూపురాణి మధుసూధనాచార్యులు, సౌమిత్రి రమేష్, ముడుంబై రామానుజాచార్యులు, తాటిపాముల లక్ష్మీనర్సింహాచార్యులు,శివయ్యలు పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో ఆలయాల చైర్మన్లు,కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### ఘనంగా విజయదశమి వేడుకలు

తిరుమలాయపాలెం: విజయదశమి పండుగను గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని బచ్చోడు, కాకరవాయి, బీరోలు, తిరుమలాయపాలెం, కొక్కిరేణి, రఘునాధపాలెం తదితర గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. సుబ్లేడు రామాలయంలో జిల్లా కాంగ్రెస్ నాయకుడు రామసహాయం నరేష్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమలాయపాలెం పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ జగదీష్ ఆధ్వర్యంలో ఆయుధ పూజ నిర్వహించారు. ఈక్యార్యక్రమంలో పోలీసుసిబ్బంది వెంకటేశ్వర్లు, హరీష్, కిషన్, రమాదేవి, వీరస్వామి పాల్గొన్నారు.



ఆయుధాలకు పూజలు చేస్తున్న సీపీ సునీల్‌దత్



నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజ





నేలకొండపల్లిలో పారువేటలో దేవతామూర్తులు, తిరుమలాయపాలెం పోలీసుస్టేషన్‌లో ఆయుధపూజ నిర్వహిస్తున్న ఎస్ఐ

## విద్యుత్‌శాఖ ఏఈపై చర్యలు వివాదాస్పదం

**నేడు ఉద్యోగుల నిరసన**

ఖమ్మంసంక్షేమవిభాగం, అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో ఇంజనీరింగ్ అధికారి బదిలీ ఇప్పుడు ఆ శాఖలోనే వివాదంగా మారింది. తోటిఅధికారులు నిరసనలకు పిలుపునిచ్చే వరకు వెళ్లింది. ఇటీవల ముదిగొండ మండలంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సమావేశం జరుగుతున్న సమయంలో పలుమార్లు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ముదిగొండలో ఏఈగా పని చేస్తున్న శ్రీనివాస్‌ను గురువారం చీమలపాడుకు బదిలీ చేశారు. అలాగే చీమలపాడులో పని చేస్తున్న రామకృష్ణను ముదిగొండకు బదిలీ చేస్తూ టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశాలిచ్చారు. అయితే విద్యుత్ అంతరాయం ప్రకృతి పరంగా జరిగిందని గాలి దుమ్మలు రావటంతో విద్యుత్ అంతరాయం జరిగిందని ఏఈకి తోటి ఏఈలు బాసటగా నిలిచారు. అన్యాయంగా బదిలీ చేశారని ఆరోపిస్తూ శనివారం ఖమ్మం విద్యుత్‌శాఖ ఎస్ఈ కార్యాలయం ఎదుట నిరసనకు పిలుపునిచ్చారు. ఈ విషయంపై టీజీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఇనుమూరి శ్రీనివాసచారిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా బదిలీ జరిగిన విషయం వాస్తవమే అన్నారు. నిరసన చెప్పే అధికారం ఉద్యోగుల ఇష్టం అన్నారు.

## రేపు ఐద్వా డివిజన్ మహాసభ

ఖమ్మంరూరల్, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): ఈనెల5న మండలంలోని ఎం.వెంకటాయపాలెం గ్రామంలో జరిగే ఐద్వా పాలేరు డివిజన్ మహాసభను జయప్రదం చేయాలని సంఘం మండల నాయకురాలు భూక్యా సైదమ్మ పిలుపునిచ్చారు.కుల,మత బేధం లేకుండా ప్రతి ఒక్కరూ సోదర భావంతోమెలగాలన్నారు. మండల పరిధిలోని కస్నాతండాలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సైదమ్మ, లక్ష్మీ, శైలజ, ఆదెమ్మ, ముత్యాలు పాల్గొన్నారు.

## క్షుద్ర పూజల కలకలం

ఖమ్మంరూరల్, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని సూర్యానగర్ పరిసర ప్రాంతంలో క్షుద్రపూజల కలకలం రేపాయి. గురువారం సూర్యానగర్ కాలనీ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు ఏదులాపురం గ్రామానికి చెందిన 9మంది ఫొటోలను చెట్టుకు వేలాడదీసి వాటికి నిమ్మకాయలు, దిష్టిబొమ్మలతో కూడిన పూజలు చేశారు. గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు లండన్‌లో ఉంటుండగా వారి ఫొటోలను కూడా చెట్టుకు వేలాడదీసి ఆ ఫొటోలపై నిమ్మకాయలు ఉంచారు. ఈ విషయంపై రూరల్ సీఐ రాజుని వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని ఇలాంటి మూఢనమ్మకాలను ఎవరూ నమ్మవద్దని సూచించారు. ఇలాంటి వాటిని ప్రోత్సహించకూడదని సీఐ రాజు పేర్కొన్నారు.

## ‘గ్రీన్‌ఫీల్డ్’ సర్వీస్‌రోడ్డు ఏర్పాటుకు కృషి చేయండి

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు**



రామచంద్రరావుకు వినతిపత్రం అందిస్తున్న నెల్లూరు

ఖమ్మంబైపాస్‌రోడ్, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నుంచి దేవరపల్లి వెళుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే విషయంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఈరోడ్డుకు ఇరువైపులా సర్వీస్‌రోడ్లు ఏర్పాటుకు జాతీయ నేతల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు, ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నారపనేని రామచంద్రరావుకు శుక్రవారం హైదరాబాదులో వినతిపత్రం అందించారు. హైవేకోస రైతులు వ్యతిరేకం కదని వారి జీవనాధారం కాపాడేలా హైవే ఇరువైపులా సర్వీసురోడ్డు నిర్మించాల్సిన అవసరంఉందని తెలిపారు. సర్వీసు రోడ్డు లేకపోతే వ్యవసాయ పనుల సాగించడం కష్టమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండారు నగేష్, యార్లగడ్డ రాఘవరావు తదితరులు పాల్గొన్నారు

## రేపు సీపీఐ సమావేశం

ఖమ్మంఅర్బన్,అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో ఆదివారం మధ్యాహన్నం 3గంటలకు నిర్వహించే కమ్యూనిస్టు పార్టీ శతవసంతాల ముగింపు ఉత్సవాల ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశాన్ని జయప్రదం చేయాలని సీపీఐ నగర కార్యదర్శి షేక్ జానీమియా పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మంలోని సీపీఐ జిల్లా కార్యాలయం లో సీపీఐ నగరసమితి ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడారు. ముగింపు సభ విజయవంతం కోసం ఆహ్వన కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో పార్టీ జాతీయ కార్యదర్శి డి. రాజా, గౌరవ అతిధులుగా బినయ్ విశ్వం, కె.నారాయణ, అజీజ్ పాష, పువ్వాడ నాగేశ్వరరావు, చాడ వెంకటరెడ్డి, జాతీయ కార్యదర్శులు కె.రామకృష్ణ,యం.వీరపాండ్యన్, తోపాటు పలు రాష్ట్రాలపార్టీ కార్యదర్శులు నాయకులు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో సీపీఐజిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాం, మేకల శ్రీనివాసరావు, పగడాలమల్లేష్, యానాల సాంబశివరెడ్డి, పోటు కళావతి, వరదనరసింహారావు, నూనెశశిధర్ ,షేక్ సైదా, తాటి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## యువత రాజకీయాల్లోకి రావాలి

**డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొడ్డు మధు**

ఖమ్మంరూరల్, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): కలుషితమైన నేటి రాజకీయాలను గాడిలో పెట్టేందుకు యువత రాజకీయాల్లోకి రావాలని డీవైఎఫ్ఐ జిల్లాకార్యదర్శి బొడ్డు మధు పిలుపునిచ్చారు. వరంగల్ క్రాస్ రోడ్డులోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం పాలేరు డివిజన్ డీవైఎఫ్ఐ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న యువజన వ్యతిరేక విధానాలను వివరించారు. 8న తిరుమలాయపాలెం మండలంలోని పిండిప్రోలులో జరిగే డీవైఎఫ్ఐ డివిజన్ సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో తోట నరేష్ రెడ్డి, నవీన్, కార్తీక్, నాగరాజు, రాజశేఖర్, రోహిత్ పాల్గొన్నారు.

## దామోదర్ రెడ్డికి యుగంధర్ నివాళి

ఖమ్మంఅర్బన్, అక్టోబరు2(ఆంధ్రజ్యోతి):మాజీమంత్రి రాంరెడ్డి పార్థీవ దేహాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తదితర ప్రముఖ నేతలతో కలిసి జిల్లా యువజన కాంగ్రెస్‌నాయకుడు తుమ్మల యుగంధర్ సందర్శించి నివాళులర్పించారు.. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

## వివక్షను విడనాడాలి

**కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు సత్యనారాయణ**

ఖమ్మంరూరల్,అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): మనుషులంతా సమానమేనని వివక్ష విడనాడాలని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఎం.వెంకటాయపాలెంలో కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. కుల,మత బేధం లేకుండా ప్రతీ ఒక్కరూ సోదర భావంతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పలయ్య, వెంకట్రావు, వరకుమార్, రామనాథం, సంగయ్య, చంద్రరావు, ప్రశాంత్, శ్రీకాంత్, రంజిత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ముందంజలో ఉండాలి

**ఆంధ్రా బ్యాంక్ సొసైటీ వైస్ చైర్‌పర్సన్ తమ్మినేని విజయలక్ష్మీ**

ఖమ్మంరూరల్, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని ఆంధ్రాబ్యాంక్ కర్షక సేవాసమితి వైస్ చైర్‌పర్సన్ తమ్మినేని విజయలక్ష్మీ అన్నారు. తెల్దారుపల్లిలో గురువారం రాత్రి నిర్వహించిన ముగ్గుల పోటీలను ఆమె ప్రారంభించారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో తమ శక్తి సామర్థ్యాలు ఉపయోగించాలన్నారు. ఇంట్లో పనులతో నిత్యం బిజీగా ఉండే మహిళలు ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల్లో విరివిగా పాల్గొన్నాలన్నారు. పోటీల్లో పాల్గొన్న ప్రతీ ఒక్కరిని అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సావిత్రి, సుమతి, రాజేశ్వరి, రజిత, ఇందు, మంగతాయి, వాణి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## గోద్రేజ్ పామాయిల్ పరిశ్రమను సత్వరమే పూర్తి చేయాలి

కొణిజర్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంజనాపురంలో ప్రైవేటు సెక్టార్‌లో పామాయిల్ పరిశ్ర నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం వంద ఎకరాల పైగా సాగు భూములు రైతుల నుంచి సేకరించి గోద్రేజ్ కంపెనీకి అప్పగించి మూడేళ్లవుతోందని, పామాయిల్‌పరిశ్రమ శంకుస్థాపన జరిగి రెండేళ్లవుతున్నా పనులు పూర్తికాలేదని సత్వరమే పరిశ్రమను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, రాష్ట్ర కమిటీ సభ్యుడు చింతనిప్పు చలపతిరావు డిమాండ్ చేశారు. శుక్రవారం రైతుసంఘం బృందం పామాయిల్ రైతులతో కలిసి అంజనాపురంలోని గోద్రేజ్‌పామాయిల్ పరిశ్రమకు కేటాయించిన భూములను పరిశీలించారు.

## ఆలయానికి బంగారం బహూకరణ

వైరా, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ రెండో వార్డు పరిధిలోని హనుమాన్ బజార్‌లో ఉన్న మహాలక్ష్మమ్మ అమ్మవారి ఆలయానికి డాక్టర్ ఓర్సు వెంకటేశ్వర్లు, శైవశ్రీ దంపతులు రూ.2.5లక్షల విలువైన బంగారాన్ని బహూకరించారు. శుక్రవారం వెంకటేశ్వర్లు, శైవశ్రీ దంపతులు ఆలయకమిటీ చైర్మన్ వేముల శివకృష్ణ ఆధ్వర్యంలో బహూకరించారు. అలాగే కొంత నగదును కూడా ఆలయానికి సమర్పించారు.

## పార్థీవదేహం వైద్య కళాశాలకు అప్పగింత

మధిర, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): పట్టణకాంగ్రెస్ నాయకులు పారుపల్లి విజయకుమార్ మాతృమూర్తి రిటైర్డ్ ఉపాధ్యాయురాలు పారుపల్లి విమల(72) గురువారం మధిరలోని తన స్వగృహంలో అనారోగ్యంతో మరణించారు. విమల కుటుంబ సభ్యులు భర్త రిటైర్డ్ ఉపాధ్యాయులు కృష్ణారావు కుమారులు విజయ్‌కుమార్, వేణుగోపాల్ విమల నేత్రాలను ఖమ్మం నేత్రనిధికి, పార్థీవ దేహాన్ని మేడ్చల్‌లోని నీలిమ వైద్య కళాశాలకు అప్పగించారు. ఈకార్యక్రమంలో తెలంగాణనేత్ర,అవయవ, శరీర దాతల సంఘం బాధ్యులు మాధవరపు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## డాక్యుమెంట్స్ పోయినవి

సిరిపురపు వెంకటేశ్వర్లు, S/o.సిరిపురపు రామయ్య R/o. H.No. 3-4-327, గాంధీనగర్, ఖమ్మం, ఖమ్మం అర్బన్ మండలం, ఖమ్మం జిల్లా, గత 20 రోజుల క్రితం గాంధీనగర్ నుండి ఖమ్మం జిరాక్స్ తీసుకోనుటకు వస్తుండగా నాయొక్క ప్లాటుకి సంబంధించిన ఓరిజినల్ లింకు డాక్యుమెంట్స్ (ఒక స్థిరాస్తి విక్రయ దస్తావేజు లింకు) నెం. 9094/2005 మధ్య మార్గంలో పోయినవి. దొరికిన వారు పై అడ్రస్‌కి అందచేయగలరు. **సిరిపురపు వెంకటేశ్వర్లు సెల్: 9849723205.**

## జాతిపితకు ఘన నివాళి

### ఘనంగా మహాత్మాగాంధీ జయంతి

ఖమ్మంఅర్బన్ అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మగాంధీ 155వ జయంతి వేడుకలను గురువారం ఖమ్మం మునిసిపల్ కార్యాలయంతోపాటు నగరంలోని పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణం, గాంధీచౌక్, గాంధీ పార్కు, తదితర చోట్ల జరిగిన కార్యక్రమాల్లో మేయర్ పునుకొల్లు నీరజ పాల్గొని గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ఉపమేయర్ ఫాతిమ జోహర, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, బాలగంగాధర్ తిలక్, దీపక్ చౌదరి, కన్నం ప్రసన్న, బాణాల లక్ష్మణ్, పుచ్చకాయల వీరభద్రం పాల్గొన్నారు.

**గాంధీ మార్గం ఆదర్శం: ఏటుకూరి**

నేలకొండపల్లి: గురువారం పాత పెట్రోలు బంకు వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి నేలకొండపల్లి భక్తరామదాసు సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు ఏటుకూరి వెంకటరామారావు నివాళులర్పించారు. అనంతరం నేలకొండపల్లిలో సొసైటీ కార్యాలయాన్ని రామారావు ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గెల్లా వెంకటరమణగుప్తా, కోశాధికారి దండా రవీంద్రబాబు, మాజీ అధ్యక్షుడు యలమద్ది లెనిన్, పొన్నగాని శ్రీనివాస్, పాలడుగు పూర్ణచంద్రప్రసాద్, గెల్లా జగన్మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు తెల్లగొర్ల లింగస్వామి, కార్యవర్గ సభ్యులు భవనాశి దుర్గారావు, కోడూరి వెంకటాచారి, పచ్చా తిరుపతయ్య, చావాగణపతి రావు పాల్గొన్నారు.



గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మేయర్ నీరజ



నివాళులర్పిస్తున్న వెంకటరామారావు



చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో..

## రైల్వే ఆస్తుల రక్షణ, ప్రయాణికుల భద్రతే లక్ష్యం

### ఆర్‌పీఎఫ్ డివిజనల్ కమిషనర్ నవీన్‌కుమార్

ఖమ్మంక్రైం, అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి): రైల్వేఆస్తుల రక్షణ, ప్రయాణికుల భద్రతే ఆర్‌పీఎఫ్ ప్రధాన లక్ష్యమని ఆర్‌పీఎఫ్ డివిజనల్ కమిషనర్ ఏ.నవీన్‌కుమార్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఆర్‌పీఎఫ్ కార్యాలయాన్ని, బ్యారక్‌లను పరిశీలించారు. నేరకేసులు, సిబ్బంది అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఆర్‌పీఎఫ్ అధికారులు, సిబ్బంది అందరు రైల్వేఆస్తులను రక్షించడానికి కృషి చేయాలన్నారు. నిషేధిత వస్తువులపై బ్లాక్ జాగరీ, గంజాయి, నిషేదిత మద్యం వంటి అక్రమ రవాణపై దృష్టిపెట్టి వాటిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఖమ్మం వచ్చిన ఆయనకు ఆర్‌పీఎఫ్ సీఐ సురేష్‌గౌడ్ మొక్కను బహూకరించారు. ఈకార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ సీఐ బుర్ర సురేష్‌గౌడ్, ఏఎస్ఐ మోడిన్‌సా, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.



నవీన్‌కుమార్‌కు మొక్క బహూకరిస్తున్న ఆర్‌పీఎఫ్ సీఐ సురేష్‌గౌడ్

## తేజకు లీడర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ పురస్కారం

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని బెస్త బజరుకు చెందిన దీటి.శ్రీనివాస్, జైనాభాయిల కుమారుడు తేజ దీటి లీడర్ ఆఫ్ ఎక్సలెన్స్ పురస్కారం అందుకున్నాడు. దుబాయ్‌లో గురువారం జరిగిన పాలీనెక్స్ కాన్ఫరెన్స్ 2025 దిఫ్యూచర్ ఆఫ్ ప్లాస్టిక్ రీసైక్లింగ్‌లో ఈ అవార్డు అందుకున్నారు. తల్లితండ్రులు ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు... తేజ మాస్టర్ ఆఫ్ ఎన్విరాల్‌మెంటల్ ఇంజనీరింగ్ అండ్ పొల్యూషన్ కంట్రోల్ విద్యను ఆస్ట్రేలియాలో చదివారు. చెత్తపై పలుప్రయోగాలను నిర్వహించారు. భారతదేశంలోని గిరిజన, గ్రామీణ ప్రాంతాలు, ఆకులను జాగ్రత్తగా సేకరించి, పర్యావరణహితమైనట్లు బౌల్స్‌గా మలిచే సమాజాల మధ్య ప్రారంభమైన నిశ్శబ్ద విప్లవం.



పురస్కారం అందుకుంటున్న తేజ



## మెరిట్ విద్యార్థికి ఆర్థికసాయం



ల్యాప్‌టాప్ అందజేస్తున్న డాక్టర్ కాపా మురళీకృష్ణ

వైరా, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): వైరాలోని న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాలకు చెందిన ప్రతిభావంతుడైన పేద విద్యార్థి గుడిపూడి రాహుల్‌దేవ్ జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీలో సీటు సాధించాడు. ఆ ప్రతిభను గుర్తించి విద్యాభ్యాసంలో మరింతగా ప్రోత్సహించేందుకుగానూ గ్రేట్ విజన్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆర్థికసాయంతో కొనుగోలు చేసిన ల్యాప్‌టాప్‌ను డాక్టర్ కాపా మురళీకృష్ణ చేతుమీదగా అందజేసి సన్మానించారు. లగడపాటి ప్రభాకర్‌రావు, తోటకూర శ్రీకాంత్, గంగవరపు కిషన్‌రాయ్, రామకృష్ణ, లాలు పాల్గొన్నారు.

## మహిళలకు చీరల పంపిణీ

వేంసూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భరణిపాడు బీసీ కాలనీలో బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా గురువారం బీఆర్ఎస్ నాయకుడు మందపాటి మహేశ్వర్‌రెడ్డి రూ.పదివేల విలువైన చీరలను మహిళలకు పంపిణీ చేశారు. జంజు శ్యామల, సరిత, మందపాటి వెంకటరెడ్డి, మందపాటి రామచంద్రారెడ్డి, మందపాటి అప్పిరెడ్డి, మందపాటి ప్రసాద్‌రెడ్డి, గుల్లపూడి రమేష్, సురటి వెంకటయ్య, రెడ్డిబోయిన సురేష్, షేక్. సలీం పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో సీపీఐ పోటీ

ఏన్కూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో బలం ఉన్న చోట పార్టీ అభ్యర్థులు బరిలో ఉంటారని సీపీఐ మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఏన్కూరులో ముఖ్యకార్యకర్తల సమావేశం బానోతు రాంబాబు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ.. జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో పార్టీ అభ్యర్థులు పోటీలో ఉంటారని తెలిపారు. కలిసివచ్చే పార్టీలతోపొత్తు అవగాహనతో ముందుకెళ్తామన్నారు. జిల్లా సమితి సభ్యులు తెప్పల సత్యం, అమరనేని వీరభద్రం, మండల కార్యవర్గ సభ్యుడు బోగినబోయిన నాగేశ్వరరావు నల్లపటి నరసింహారావు, బానోతు లక్‌పతి, యల్లయ్య, తాళ్లూరి రమణ, మల్లెంపాటి కోటేశ్వరరావు, , నాగరాజు , సీతారాములు పాల్గొన్నారు.

## మహాలక్ష్మమ్మ ఆలయానికి బంగారం బహూకరణ



బంగారాన్ని అందజేస్తున్న ఓర్సు వెంకటేశ్వర్లు, తైవశ్రీ దంపతులు

వైరా, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ రెండోవార్డు పరిధిలోని హనుమాన్ బజార్‌లో ఉన్న మహాలక్ష్మమ్మ అమ్మవారి ఆలయానికి డాక్టర్ ఓర్సు వెంకటేశ్వర్లు, తైవశ్రీ దంపతులు రూ.2.5లక్షల విలువైన బంగారాన్ని బహూకరించారు. శుక్రవారం వెంకటేశ్వర్లు, తైవశ్రీ దంపతులు అమ్మవారి ఆలయంలో పూజలు చేసి బంగారాన్ని ఆలయకమిటీ చైర్మన్ వేముల శివకృష్ణ ఆధ్వర్యంలో బహూకరించారు. అలాగే కొంత నగదును కూడా ఆలయానికి సమర్పించారు. దాతలను ఆలయకమిటీ నిర్వాహకులు సన్మానించారు. చైర్మన్ శివకృష్ణ, అర్చకుడు రాజశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో మహిళ మృతి.. ఎమ్మెల్యే పరామర్శ

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కృషిబైపాస్ రోడ్‌లో నివాసం ఉంటున్న పెనుబల్లి పంచాయితీరాజ్ శాఖ ఏఈ కదారి రమేష్ సతీమణి శైలజ (45) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. మృతివార్త తెలుసుకున్న సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ఆమె నివాసానికి వెళ్లి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతురాలు భర్త రమేష్, పిల్లలు సాయిభరద్వాజ్, భువనచంద్రికలను ఓదార్చి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మాల మహానాడు బాధ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## గ్రూప్ 1, 2 విజేతలకు సన్మానం

తల్లాడ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం నుంచి గ్రూప్ 1, 2 లకు ఎంపికైన విజేతలను పలువురు ప్రముఖులు ఘనంగా సన్మానించారు. గ్రూప్1 ద్వారా ఎంపీడీవోగా ఎంపికైన తల్లాడకు చెందిన గోపిశెట్టి సుస్మితను ఆర్యవైశ్య సంఘం నాయకులు సన్మానించారు. గ్రూప్2 ద్వారా ఎంపీవోగా ఎంపికైన బాలపేట గ్రామానికి చెందిన పడాల రమేష్‌బాబును అయ్యప్ప భక్త బృందం సభ్యులు ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్ గుర్రం శేషగిరిరావు, ఆర్యవైశ్య సంఘం మండల నాయకులు నంబూరి మోహనరావు, జవ్వాజి నరసింహారావు, దారా విష్ణుమోహనరావు, వేమిశెట్టి వెంకటేశ్వరరావు, అయ్యప్ప భక్తబృందం సభ్యులు చిట్టెం నరసింహారావు, రామారావు, అవతి వెంకటరామారావు, పాలెపు రామారావు, శివ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## పార్థివ దేహం వైద్య కళాశాలకు అప్పగింత

మధిర, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణ కాంగ్రెస్ నాయకులు పారుపల్లి విజయకుమార్ మాతృమూర్తి రిటైర్డ్ ఉపాధ్యాయురాలు పారుపల్లి విమల(72) గురువారం మధిరలోని తన స్వగృహంలో అనారోగ్యంతో మరణించారు. విమల కుటుంబ సభ్యులు భర్త రిటైర్డ్ ఉపాధ్యాయులు కృష్ణారావు కుమారులు విజయ్‌కుమార్, వేణుగోపాల్ విమల నేత్రాలను ఖమ్మం నేత్రనిధికి, పార్థీవ దేహాన్ని మేడ్చల్‌లోని నీలిమ వైద్య కళాశాలకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల సంఘం బాధ్యులు మాధవరపు నాగేశ్వరరావు, గంజి ఈశ్వరలింగం పాల్గొన్నారు.

## ఘనంగా దసరా సంబురాలు

వైరాలో గురువారం దసరా సంబరాలు సంప్రదాయ రీతిలో అంగరంగవైభవంగా జరుపుకున్నారు. స్థానిక కోదండ రామాలయంలో జరిగిన దసరా ఉత్సవాల్లో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మలాడారు. అలాగే పలు ప్రాంతాల్లో మహిళలు షమీ పూజలు నిర్వహించి బతుకమ్మలడారు. పలు చోట్ల ప్రజలు ఆయుధపూజలు నిర్వహించారు.



బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



తల్లాడలో బోనాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు



తుంబూరులో..



జమలాపురం ఆలయంలో కోటేశ్వరరావు దంపతులు

## భట్టిని కలిసిన పుల్లయ్య



చింతకాని, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): చింతకాని బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య ఆయన అనుచరులు శుక్రవారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిశారు. పెంట్యాల పుల్లయ్య బీఆర్ఎస్‌ను విడిచి కాంగ్రెస్‌లో చేరుతుండటంతో ఈ భేటి ప్రాధాన్యత సంచరించుకుంది. మండలంలో తాజా రాజకీయ పరిణామాలు, స్థానిక సంస్థల ఎన్నికలపై పుల్లయ్యతో భట్టి చర్చించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఈ నెల 6వ తేదీన మండల కేంద్రంలో నిర్వహించే భహిరంగ సభలో పెంట్యాల పుల్లయ్యతో పాటు భారీ సంఖ్యలో ఆయన అనుచరులు భట్టి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు.

## భవిష్యత్‌లో మరిన్ని సంక్షేమ పథకాలు

**» మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



రేజర్ల ఆలయంలో మాట్లాడుతున్న మంత్రి

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారని, ప్రజల కోసం భవిష్యతులో మరిన్నీ సంక్షేమ పథకాలను ముందుకు తీసుకురానున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం సత్తుపల్లి మండలం రేజర్లలో గుట్టసత్తెమ్మ అమ్మవారి గుట్టపై నూతనంగా నిర్మించిన ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం కన్నులపండువగా సాగింది. ఈ సందర్భంగా హాజరైన మంత్రి పొంగులేటి సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, కాంగ్రెస్



ఆలయ ప్రతిష్ఠలో పోటెత్తిన భక్తజనం

పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్‌తో కలిసి ప్రత్యేక ప్రతిష్ఠలో పాల్గొని పూజలు నిర్వహించారు. దసరా పర్వదినం సందర్భంగా బ్రహ్మశ్రీ వెల్లటూరి ప్రసాదాచారి, కోటిలింగాల శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామిజీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు గొర్ల వెంకటరెడ్డి, రాంబాబు, దేశిరెడ్డి సత్యనారాయణరెడ్డి, భీమిరెడ్డి గోపాలరెడ్డి, చింతల సురేందర్‌రెడ్డి, హిమాకర్‌రెడ్డి, నంద్యాల వెంకటరెడ్డి, వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, కాకర్ల రాంబాబు, జె.ప్రభాకర్, ఖలీల్, దేశిరెడ్డి దామోదర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆర్అండ్‌బీ రోడ్డును పూర్తి చేయాలి

వేంసూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): వేంసూరు మండలం మర్లపాడు సెంటర్ నుంచి జడ్పీ ఉన్నత పాఠశాల వరకు ఉన్న రోడ్డును వెంటనే పూర్తి చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ రోడ్డు నిర్మాణంలో భాగంగా రెండు నెలల క్రితం మెటల్ పోసి ఆ తర్వాత తారు వేయకుండా వదిలేయడంతో ద్విచక్రవాహనచోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. అలాగే వాహనాలు రాకపోకలు సాగిస్తున్న సమయంలో రోడ్డుపక్కన నివసించేవారు దుమ్ముతో తీవ్ర అవస్థలకు గురికావడంతో పాటు నాసిరకంగా రోడ్డు నిర్మాణం చేపడుతున్నారని వారు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాణ్యతతో రోడ్డు నిర్మాణాన్ని చేపట్టి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గొర్ల ప్రభాకర్‌రెడ్డి, నాయకులు పర్సా రాంబాబు, మట్టా ప్రసాద్, బాలకృష్ణారెడ్డి, మాషూరి రఘునాథరెడ్డి, వీరంరాజు, తక్కెళ్లపాటి భాస్కర్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

## చేసిన పనులే శాశ్వతం: మంత్రి తుమ్మల

సత్తుపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మనుషులు శాశ్వతం కాదని, వారు చేసిన సేవా కార్యక్రమాలు, పనులు శాశ్వతంగా ప్రజల హృదయాల్లో నిలిచి ఉంటాయని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం సత్తుపల్లి మండలం గంగారంలో పలు కార్యక్రమాలలో ఆయన



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన తుమ్మల



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంగారం గ్రామానికి చెందిన దాసరి వెంకట్రామిరెడ్డి (చిట్టినాయన) కుమారుడు దాసరి మధుమోహనరెడ్డి తన సంపాదనలో పెద్ద మొత్తంలో గ్రామంలో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి మాట్లాడుతూ.. దాసరి వెంకట్రామిరెడ్డి, మధుమోహనరెడ్డి సొంత ఖర్చుతో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు. సుమారు రూ.6కోట్లకు పైగా ఖర్చు చేసి ప్రజలకు ఉపయోగపడే పనులు చేయడం అభినందనీయమన్నారు. అలాగే గ్రామంలో దాసరి మధుమోహనరెడ్డి ఆధ్వర్యంలో సొంత నిధులతో నిర్మించిన చాకలి ఐలమ్మ భవన్, జలగం నగర్‌లో 5మంచినీటి బోర్లు, చర్చీ, దుర్గాదేవి ఆలయ మండపం, దుర్గమ్మ దేవాలయం ఆర్చీ, గ్రామం మొత్తం సీసీ కెమెరాల, యాదవ కమ్యూనిటీ హాల్, యానాదుల ఇళ్లవద్ద చుట్టూ నిర్మించిన ప్రహరీలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే డాక్టర్ రాగయయి, కాంగ్రెస్ నాయకుడు దయానంద్‌లు ప్రారంభించారు.

## స్థానిక ఎన్నికల్లో పోటీకి సిద్ధం

కొణిజర్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో పోటీచేస్తామని భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు యర్రాబాబు, దొండపాటి రమేష్ తెలిపారు. శుక్రవారం కొణిజర్ల మండల కేంద్రంలోని దొండపాటి భవన్‌లో పాపకంటి సుదర్శన్ అధ్యక్షతన జరిగిన సీపీఐ కొణిజర్ల మండల సమితి అత్యవసర సమావేశంలో వీరు పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు మండలంలో పార్టీ బలంగా ఉన్న గ్రామపంచాయతీల్లో, మండల ప్రాదేశిక నియోజకవర్గాలకు పోటీచేస్తామన్నారు. కొణిజర్ల మండల జడ్పీటీసీకి తప్పనిసరిగా పోటీచేస్తామన్నారు. మిత్రపక్షంగా ఉండే పార్టీలతో ఎన్నికల పొత్తులు కుదుర్చుకోవడానికి తాముసిద్ధంగానే ఉన్నామని, పొత్తు లేకపోయినా మరింత క్రియాశీలకంగా పాల్గొంటామన్నారు. గతంలో పొత్తుల విషయంలో అనేక అనుభవాలు ఉన్నాయని, కమ్యూనిస్టుగా వాటిని ఎలా చిత్తుచేయాలో తమకు బాగా తెలుసన్నారు. గతంలో కొన్ని పార్టీలు పొత్తు పెట్టుకుని, అనైతిక పొత్తులకు పాల్పడి మిత్రపక్షంగా ఉన్న పార్టీలను నట్టేట ముంచాయన్నారు. ప్రస్తుతమున్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కమ్యూనిస్టుల సత్తా ఏంటో అందరికి తెలుసన్నారు. అధికార పార్టీని ప్రతిపక్షానికి తీసుకురావడం కమ్యూనిస్టుల వల్లే సాధ్యమని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి గడల భాస్కరరావు, సహాయ కార్యదర్శులు స్వర్ణరమేస్, మణిగ కోటేశ్వరరావు, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, సీపీఐ నాయకులు పీవీ రావు, వెంపటి పరశురాములు, కంపసాటి వెంకన్న, పిట్టల రాంబాబు, మోదుగు చిన్నవెంకటి, అచ్చన శ్రీనివాసరావు, యాసా వెంకటేశ్వరరావు, పిడియాల వెంకటి, పెనుగొండ వెంకటి పాల్గొన్నారు

## గోద్రేజ్ పామాయిల్ పరిశ్రమను సత్వరమే పూర్తి చేయాలి

కొణిజర్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంజనాపురంలో ప్రైవేటు సెక్టార్‌లో పామాయిల్ పరిశ్ర నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం వంద ఎకరాల పైగా సాగు భూములు రైతుల నుంచి సేకరించి గోద్రేజ్ కంపెనీకి అప్పగించి మూడేళ్లవుతోందని, పామాయిల్‌పరిశ్రమ శంకుస్థాపన జరిగి రెండేళ్లవుతున్నా పనులు పూర్తికాలేదని సత్వరమే పరిశ్రమను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, రాష్ట్ర కమిటీ సభ్యుడు చింతనిప్పు చలపతిరావు డిమాండ్ చేశారు. శుక్రవారం రైతుసంఘం బృందం పామాయిల్ రైతులతో కలిసి అంజనాపురంలోని గోద్రేజ్‌పామాయిల్ పరిశ్రమకు కేటాయించిన భూములను పరిశీలించారు. పనులు వేగవంతం చేసి పామాయిల్‌పరిశ్రమ రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో గోపవరం సొసైటీ డైరెక్టర్, పామాయిల్‌రైతులు సంక్రాంతి నరసయ్య, సంక్రాంతి పురుసోత్తం, కట్టా రాంబాబు, దుగ్గిన్ని అజయ్ పాల్గొన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న నాయకులు

## భట్టి అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరికలు

**» భట్టి సతీమణి మల్లు నందిని**

చింతకాని, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై అన్ని పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో పలు పార్టీల నుంచి సుమారు 60 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరారు. సంధర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదల కళ్లలో ఆనందం కనబడుతోందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల జారీతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొందన్నారు. సంక్షేమ పథకాలతో ప్రజలు కాంగ్రెస్‌కు ఆకర్షితులవుతున్నారని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో అన్ని గ్రామాల్లో గెలుస్తామన్నారు. అనంతరం పార్టీలో చేరుతున్న వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు, కన్నెబోయిన గోపి, మడుపల్లి భాస్కర్, కొప్పుల గోవిందరావు, గాదె రామారావు, నూతలపాటి వెంకటేశ్వర్లు, నెల్లూరి కోటేశ్వరరావు, బందెల నాగార్జున, పెంట్యాల అప్పారావు, తోటకూరి ప్రగతి, నాయకులు పాల్గొన్నారు.

## 'స్థానిక' సమరంలో బీఆర్ఎస్ సత్తాచాటాలి

కల్లూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సమరంలో గెలుపే ధ్యేయంగా బీఆర్ఎస్ శ్రేణులు సత్తాచాటాలని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పిలుపునిచ్చారు. కల్లూరులో శుక్రవారం స్థానిక ఎన్నికల సమరంపై బీఆర్ఎస్ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సండ్ర ప్రసంగిస్తూ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల విజయంపై పార్టీ క్యాడర్‌కు దిశనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని తీవ్రంగా విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రైతులకు ఎలాంటి ఇబ్బందుల కలగకుండా యూరియా అందించగా కాంగ్రెస్ పాలనలో యూరియా అందక కష్టాల పాలవుతన్నారని ఆరోపించారు. పోలీసుల రక్షణతో రైతులకు యూరియా పంపిణీ చేయాల్సిన దుస్థితి కాంగ్రెస్ పాలనలో వచ్చిందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు కూడా కాంగ్రెస్ పాలకుల అడ్డగా మార్చుకున్నారని సండ్ర తీవ్రంగా ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ముద్రించిన కార్డులను వెంట బెట్టుకోని ఇంటింటా ప్రచారం చేస్తూ ముందుకు సాగాలని బీఆర్ఎస్ శ్రేణులకు దిశనిర్దేశం చేశారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించి ప్రజలు బాధపడుతన్నారని అన్నారు. మరల కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. స్థానిక ఎన్నికల సమరంలో బీఆర్ఎస్ శ్రేణులు ఉత్సహంగా పని చేస్తూ అభ్యర్థులు విజయం సాధించేలా ఐక్యంగా పనిచేయాని కోరారు. ఈ నెల 10 తేదినాటికి బీఆర్ఎస్ తరుపున అభ్యర్థులు నామినేషన్లు వేసేలా సిద్ధం కావాలని సండ్ర కోరారు. ఈ సమావేశంలో మండల బీఆర్ఎస్ నాయకులు పాలెపు రామారావు, కట్టా అజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ బీరవల్లి రఘు, లక్కినేని రఘు, దేవరపల్లి భాస్కరరావు, బోబోలు లక్ష్మణరావు, పెద్దబోయిన మల్లేశ్వరరావు, ఎస్‌కె కమ్లి, పెడకంటి రామకృష్ణతో పాటుగా పలు గ్రామాల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



కల్లూరు సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

## సత్యం, అహింస గాంధీ నమ్మిన సిద్ధాంతాలు: ఎమ్మెల్యే

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): సత్యం, అహింస మహాత్ముడు గాంధీజీ నమ్మిన సిద్దాంతాలు అని, సహాయ నిరాకరణ, సత్యాగ్రహం ఆయన ఆయుధాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. గురువారం మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రీల జయంతుల సందర్భంగా సత్తుపల్లి పట్టణంలోని వారి విగ్రహాలకు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అదేవిధంగా మండలంలోని గంగారంలోని 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో కమాండెంట్ ఎన్.పెదబాబు గాంధీజి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

వైరా, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): వైరా మండల కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం మహాత్మాగాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, మార్కెట్ కమిటీ చైర్మన్ బొర్ర గంగారావు పాల్గొన్నారు.

తల్లాడ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం కాంగ్రెస్ పార్టీ, లయన్సుక్లబ్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక బాలభారతి విద్యాలయంలో కేఎస్ఎం, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఎంఈవో ఎస్.దామోదర ప్రసాద్, దారా విష్ణుమోహనరావు, కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, లయన్స్‌క్లబ్ నిర్వాహకులు కోదూరు నాగేశ్వరరావు, కర్నాటి లక్ష్మారెడ్డి, బెల్లంకొండ అంజనేయులు, కటికి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. మండల కాంగ్రెస్ కార్యాలయంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన కాపా సుధాకర్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు.



గాంధీవిగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మట్టా రాగమయి



వైరాలో..



తల్లాడలో..

## బైక్ అదుపుతప్పి ఇద్దరికి తీవ్రగాయాలు

కారేపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గాంధీనగరం రైల్వే గేటు వద్ద గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి కామేపల్లి మండలం లాల్యతండాకు చెందిన లావుడియా గణేష్, భూక్య వీరబాబు కారేపల్లి మండల ఉసిరికాయలపల్లిలో జరుగుతున్న కోటమైసమ్మ జాతరకు వెళ్ళి తిరగి వస్తూండుగా అర్ధరాత్రి 2గంటల సమయంలో గాంధీనగరం రైల్వే గేటు వద్ద బైక్ అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. శబ్ధం విన్న స్థానికులు వారిని 108ద్వారా ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. కాగా మెరుగైన వైద్యం కోసం గణేష్‌ను హైద్రాబాద్‌కు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలనికి చేరుకుని దర్యప్తు చేపట్టారు.



ప్రమాదంలో గాయపడిన వీరబాబు

## మానవాళి కోసమే యజ్ఞయాగాలు

మధిర, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): సర్వ మానవాళి శ్రేయస్సు కోసమే యజ్ఞయాగాలు నిర్వహించడం జరుగుతుందని అగస్త్య పీఠము స్వామీజీ శ్రీ స్వామి సుగుణానంద గాయత్రి అన్నారు. శుక్రవారం ఆయన మధిర లో జిల్లా కాంగ్రెస్ నాయకులు మల్లాది వాసు ఆయన సతీమణి మాజీ వార్డు కౌన్సిలర్ మల్లాది సవితలను వారి నివాసంలో కలిసి ఆశీర్వదించి వారిని వీరులపాడు మండలం నరసింహరావుపాలెం లోని అగస్త్య పీఠం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న లలిదాదేవి ఆలయానికి ఆహ్వానించారు. పీఠం ఆధ్వర్యంలో జరిగే శతచండీయాగం, రాజశ్యామలయాగానికి రావలసిందిగా ఆహ్వానించారు, అనంతరం స్వామి మధిర పట్టణలో పలువురు ప్రముఖులను కలిసి ఆహ్వానించారు.



మల్లాది దంపతులను సన్మానిస్తున్న స్వామీజీ

## ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి

**» సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి**

సత్తుపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి కోరారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్‌తో కలిసి కల్లూరు, తల్లాడ మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో ఆమె సమావేశమయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్దంగా ఉండాలని, కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అధిష్టానం నిర్ణయించిన అభ్యర్థికే మెజార్టీ వచ్చేలా ప్రచారం సాగాలని, ఎన్నికలు పూర్తయ్యేవరకు విశ్రమించేదే లేదని పిలుపునిచ్చారు.